




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 1 సంచిక : 121 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తాడేపల్లిగూడెం శుక్రవారం 13 మార్చి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 121 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM FRI 13 MARCH 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur




## ఫరూక్ అబ్దుల్లాపై నాన్ బెయిలబుల్ వారెంట్

- జేకేసీఏ స్కామ్ కేసులో ఫరూక్ అబ్దుల్లాకు నాన్ బెయిలబుల్ వారెంట్
- వ్యక్తిగత హాజరు మినహాయింపు పిటిషన్‌ను తిరస్కరించిన శ్రీనగర్ కోర్టు
- క్రికెట్ నిధుల దుర్వినియోగంపై సీబీఐ గతంలోనే ఛార్జిషీట్ దాఖలు
- మార్చి 30కి తదుపరి విచారణను వాయిదా వేసిన న్యాయస్థానం

మిగతా 2లో




## గల్ఫ్‌లో అమెరికా సైనిక స్థావరాలు ఎత్తేయాల్సిందే..

### లేదంటే అటాక్ చేస్తూనే ఉంటాం

### ఇరాన్ సుప్రీం లీడర్ ఫస్ట్ రియాక్షన్

పెన్ పవర్ డెస్క్:గల్ఫ్ లో ఉన్న అమెరికా సైనిక స్థావరాలు ఎత్తేయాల్సిందే.. లేదంటే అటాక్ చేస్తూనే ఉంటాం.. ఇది ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ ఫస్ట్ రియాక్షన్. ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతొల్లా అలీ ఖమేనీ మరణించిన తర్వాత కొత్తగా అపాయింట్ అయిన మొజ్తాబా ఖమేనీ.. చాలా రోజులుగా మౌనం వహిస్తూ.. గురువారం (మార్చి 12) తొలిసారిగా స్పందించారు. ఈ సందర్భంగా అమెరికా, ఇజ్రాయెల్ సహా వాటి

మిగతా 2లో




# దేశంలోనే తొలి

# అటానమస్ షిప్ యార్డ్...

## జువ్వలదిన్నెలో శంకుస్థాపన చేసిన మంత్రి నారా లోకేశ్

- నెల్లూరు జిల్లా జువ్వలదిన్నెలో అటానమస్ షిప్ యార్డ్‌కు మంత్రి లోకేశ్ శంకుస్థాపన
- సాగర్ డిఫెన్స్ సంస్థ తొలి దశలో రూ.45 కోట్ల పెట్టుబడి
- వెయ్యి మందికి పైగా స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు
- ఏపీని మారిటైం రోబోటిక్స్ హబ్‌గా మార్చడమే లక్ష్యం
- 2026 నవంబర్ నాటికి వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభం



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక, రక్షణ రంగాల్లో మరో కీలక ముందడుగు పడింది. దేశ సముద్ర సాంకేతిక సామర్థ్యాలను గణనీయంగా పెంచే దిశగా నెల్లూరు జిల్లా బోగోలు మండలం జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ వద్ద దేశంలోనే మొట్టమొదటి అటానమస్ మారిటైం షిప్ యార్డ్, సిస్టమ్స్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ గురువారం శంకుస్థాపన చేశారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో సాగర్ డిఫెన్స్ ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును అభివృద్ధి చేయనుంది. శంకుస్థాపన కార్యక్రమానికి జువ్వలదిన్నె చేరుకున్న మంత్రి లోకేశ్ కు సాగర్ డిఫెన్స్ సంస్థ నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం

మిగతా 2లో

## పన్ను ఎగవేతదారులు తప్పించుకోవడానికి వీల్లేదు

- పన్ను ఎగవేతలను అరికట్టాలని అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం
- ఇతర రాష్ట్రాల్లో ఉంటూ ఏపీలో పనిచేసే కాంట్రాక్టర్లపై ప్రత్యేక దృష్టి
- పన్ను ఎగవేతదారులను గుర్తించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం
- ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వం నుంచి అందే లబ్ధిని వివరిస్తూ సంక్షేమ లేఖ ఇవ్వాలని ఆదేశం
- పథకాల అమలులో పూర్తి పారదర్శకత తీసుకురావడమే లక్ష్యమని వెల్లడి

మిగతా 2లో



## వడగాలుల వల్ల ఒక్క మరణం కూడా జరగడానికి వీల్లేదు

### కలెక్టర్లకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

- రెండో రోజు కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు సమీక్ష
- వడదెబ్బ మరణాలు నివారించాలని స్పష్టమైన ఆదేశం
- వైద్యంలో ఏఐ, టెక్నాలజీ వినియోగాన్ని పెంచాలని సూచన
- 108 అంబులెన్సులు వేగంగా చేరేలా చర్యలు చేపట్టాలి
- ఉపాధి కూలీలు, పశువుల కోసం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టీకరణ

మిగతా 2లో



## హోర్ముజ్ మీదుగా భారత్ వచ్చే నౌకల ప్రయాణంపై ఇరాన్‌తో చర్చించాం

- దేశ ఇంధన భద్రతపై చర్చించినట్లు రణధీర్ జైశ్వాల్ వెల్లడి
- డీజిల్ సరఫరా కోసం బంగ్లాదేశ్, శ్రీలంక, మాల్దీవుల నుంచి విజ్ఞప్తులు వచ్చాయని వెల్లడి
- ముందుగా మన దేశ అవసరాలను కేంద్రం పరిగణనలోకి తీసుకుంటుందన్న భారత్

పెన్ పవర్ డెస్క్:హోర్ముజ్ జలసంధి మీదుగా భారత్‌కు వచ్చే నౌకల ప్రయాణం గురించి ఇరాన్‌తో చర్చిం చామని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ అన్నారు. దేశ ఇంధన భద్ర తపై ఆ దేశంతో చర్చించినట్లు తెలిపారు. ఆయన మీడియా సమావేశంలో మాట్లాడు తూ, డీజిల్ సరఫరా కోసం బంగ్లాదేశ్ ప్రభు త్వం విజ్ఞప్తి చేసిందని అన్నారు. శ్రీలంక, మాల్దీవుల నుంచి కూడా ఇదే తరహా అభ్యర్థనలు వచ్చాయని కానీ ముందుగా మన దేశ అవసరాలను కేంద్రం

మిగతా 2లో





## ఇఫ్తార్ విందులు సరే...

## రంజాన్ తోఫా ఏది?

- రంజాన్ తోఫా ఇవ్వకుండా ఇఫ్తార్ విందులు ఎందుకని ప్రభుత్వానికి ప్రశ్న
- చంద్రబాబు మోదీకి, బీజేపీకి భయపడుతున్నారని ఆరోపణ
- మైనారిటీ సంక్షేమంపై కూటమి ప్రభుత్వానిది బూటకమని విమర్శ
- వెంటనే పేద ముస్లింలకు తోఫా పంపిణీ చేయాలని డిమాండ్

మిగతా 2లో




## ఇది ప్రారంభం మాత్రమే...

## గ్యాస్ కొరతతో దేశం అల్లాడుతోంది

- దేశానికి ఇంధన సంక్షోభం ముంచుకొస్తోందని రాహుల్ గాంధీ హెచ్చరిక
- గ్యాస్, పెట్రోల్, ఎల్పీజీ సరఫరాలో తీవ్ర సమస్యలు తప్పవని ఆందోళన
- ప్రభుత్వ తప్పుడు విదేశాంగ విధానాలే ఈ పరిస్థితికి కారణమని విమర్శ
- ప్రజల ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని సూచన
- ఈ అంశంపై మాట్లాడేందుకు లోక్‌సభలో అనుమతి నిరాకరించారని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, దేశ ఇంధన భద్రతపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ తప్పుడు విదేశాంగ విధానాల కారణంగా దేశం త్వరలో గ్యాస్, పెట్రోల్ వంటి ఇంధనాల

మిగతా 2లో

## సీఎం చంద్రబాబు అభినందించడం పట్ల ఆనందం వ్యక్తం చేసిన మంత్రి కందుల దుర్గేశ్

- ఏపీ పర్యాటక రంగంలోకి పెట్టుబడులు.. సీఎం చంద్రబాబు ప్రశంసలు
- విశాఖలో భారీ అమ్యూజ్‌మెంట్ పార్క్
- రూ.100 కోట్లతో ఒప్పందం
- ముంబై పర్యటన విజయవంతం అయిందన్న మంత్రి కందుల దుర్గేశ్



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగంలోకి పెట్టుబడులను ఆకర్షించేందుకు తాను జరిపిన ముంబై పర్యటనను ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించడంపై రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేశ్ ఆనందం వ్యక్తం చేశారు. సీఎం ప్రశంసలు తనలో మరింత ఉత్సాహాన్ని నింపాయని ఆయన తెలిపారు. ముంబయిలో జరిగిన ఐఏఏపీఐ ఎక్స్‌పోలో తాను పాల్గొని, రాష్ట్ర పర్యాటక పాలసీ, పెట్టుబడిదారులకు అందిస్తున్న ప్రోత్సాహకాల గురించి వివరించినట్లు మంత్రి తెలిపారు. దీనికి అద్భుతమైన స్పందన వచ్చిందన్నారు. ప్రముఖ సంస్థ 'మోడ్రన్ మస్తీ ప్రైవేట్ లిమిటెడ్' విశాఖపట్నంలో రూ.100 కోట్ల పెట్టుబడితో ఒక భారీ అమ్యూజ్‌మెంట్

మిగతా 2లో

## వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి అనుచరుడి అరెస్ట్

- కర్నాటి వీరభద్రరావును అరెస్ట్ చేసిన విజయవాడ పటమట పోలీసులు
- హైకోర్టు అడ్వకేట్‌ను నిర్బంధించి బలవంతంగా ఆస్తులు రాయించుకున్నట్లు ఆరోపణలు
- పరారీలో ఉన్న మరో నిందితుడు కర్నాటి సతీశ్

మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# ఇంటి అమ్మాయిలను కాపాడుకుందాం!

కేంద్ర ప్రభుత్వం 2025 ఆర్ధిక సంవత్సరం బడ్జెట్‌లో మహిళల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకోని హ్యూమన్ పపిల్లోమ వైరస్ టీకా కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. మన రాష్ట్రంలో ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజ నరసింహ కింగ్ కోటి ఆసుపత్రి నుంచి ఈ టీకా కార్యక్రమాన్ని ప్రారంభించారు.. ఇక ఈ టీకా కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 8వ తారీఖున మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని అన్ని ఆరోగ్య కేంద్రాలలో ప్రారంభమయింది. హ్యూమన్ పపిల్లోమ వైరస్ లైంగిక సంపర్కం వల్ల సంక్రమించే వ్యాధి. హ్యూమన్ పపిల్లోమ వైరస్‌లు మొత్తం 200 రకాల వరకు ఉన్నాయి.. ఇందుకు గర్భాశయ కాన్సర్‌కు కారణమయ్యేవి 6,11,16,18 రకానికి సంబంధించినవి. ఎక్కువ మంది మహిళలు ఈ వైరస్ బారిన పడి కేన్సర్ బాధితులుగా మారుతున్నారు.. ఈ కేన్సర్‌ను ఎదుర్కొంటున్న వారిలో పెళ్లిళ్లు అయిన మహిళలే అధికంగా ఉంటున్నారు.. ప్రారంభ స్థాయిలోనే ఈ వైరస్‌ను అరికట్టాలన్నది ప్రభుత్వ ఆశయం. అందుకే కేంద్ర ప్రభుత్వం 14. సం? దాటి 15 సం?లోపు , అమ్మాయిలకు ఈ వాక్సిన్ ఇవ్వాలన్నది టార్కెట్‌గా నిర్ణయించు కున్నది. ఈ స్కీంలో బాగంగా 14 సం.నిండిన బాలికలకు గర్థాసిల్– 4 వాక్సిన్‌ను ఒక డోస్ ఇస్తారు. ఈ వాక్సిన్ అమ్మాయిల్లో వైరస్ నిరోధక శక్తిని పెంపొందిస్తుంది. గర్భాశయ కేన్సర్ పట్ల మన సమాజంలో అవగాహన చాలా తక్కువ. సెక్స్‌లో పాల్గొన్నప్పుడు అధిక రక్త స్రావం, బుతు క్రమంలో ఎక్కువ రోజులు రక్తస్రావం, ఆ సందర్భంగా బుతు క్రమం రావడం, బుతు క్రమంలో దుర్గంధం ఉండడం మొద లైనవి గర్భాశయ కాన్సర్‌కు ముందస్తు హెచ్చరికలు..ఈ నెల 8వ తారీఖు నుండి అన్ని ప్రాధమిక ఆరోగ్య కేంద్రాలలో, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో, ఏరియా జిల్లా వైద్య ఆసుపత్రి కేంద్రాలో ఉదయం 10 గం? నుండి మ 2 గం ? వరకు 14 సం ? నిండి 15 సం ? దాటని అమ్మాయిలకు సింగల్ డోస్గా గర్ధసిల్ – 4 అనే వాక్సిన్ ఇస్తారు.. మహిళల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఈ వాక్సిన్‌ను ఉచితంగా అందిస్తుంది. టీకా తీసుకోవాల్సిన అమ్మాయిల తల్లితండ్రులు యూ–విన్ సైట్ ద్వారా అమ్మాయి పేరు రిజిస్టర్ చేసుకోవాలి. అమ్మాయిలకు టీకా వేయాలంటే తల్లితండ్రులు అంగీకారం తప్పనిసరి. గర్భంతో ఉన్న మహిళలు ఈ వాక్సిన్ వేసుకోరాదు. అనారోగ్య సమస్యలు, జ్వరంతో బాధపడుతున్న వారు కుదుట పడే వరకు అగడం మంచిది. గతంలో హెచ్.పి.వి టీకా కాని తీసుకుని ఉంటే మళ్ళి తీసుకోవాల్సిన అవసరం లేదు. కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకోవాలంటే కుటుంబంలోని మహిళ ఆరోగ్యంగా ఉండాలి. ఎందరో మహిళలు హెచ్.పి.వి వైరస్ బారిన పడి ఆసుపత్రుల చుట్టు తిరుగుతూ ఆర్థికంగా నష్టపోతున్నారు. గర్భాశయ కేన్సర్‌పై అవగాహన లేక ఎన్నో కుటుంబాలు ఆ ఇంటి తల్లులను కోల్పోతున్నాయి.. ప్రభుత్వం ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించాలనే ఉద్దేశంతో 14 సం. నిండిన అందరు అమ్మాయిలకు వాక్సిన్ ఇవ్వడానికి పూనుకుంది. ఆరోగ్య వంతమైన సమాజ నిర్మాణంలో మన మందరం బాగస్వాములమవుదాం. మన ఇంటి అమ్మాయిలను కాపాడుకుందాం.

# గల్ఫ్‌లో అమెరికా సైనిక స్థావరాలు ఎత్తేయాల్సిందే..

- మొదటి పేజి తరువాయి

మిత్ర దేశాలకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు.

**ఖమేనీ స్టేట్‌మెంట్స్:**

హర్మూజ్ జలసంధి మేసే ఉంటుంది
మిత్ర దేశాలతో స్నేహం కొనసాగుతుంది
కానీ అమెరికాతో అంటకాగితే పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది
పశ్చిమాసియాలో ఉన్న అమెరికా ఆర్మీ బేస్ క్యాంపులను ఎత్తేయాలి
లేదంటే వాటిపైన మరింత తీవ్రంగా దాడి చేస్తాం
సైనిక స్థావరాలు మూసేవరకు టార్గెట్ చేస్తూనే ఉంటాం
హర్మూజ్ జలసంధిని బ్లాక్ చేసే ప్రాంతాన్ని వాడుకుంటూ యుద్ధంలో పైచేయి సాధిస్తాం
గల్ఫ్ దేశాలు అమెరికా మిలిటరీ బేస్ లను మూసివేయాలి
లేదంటే మా ఫస్ట్ టార్గెట్స్ అవే అవుతాయి

ఆయతొల్లా ఖమేనీపై జరిగిన దాడిలో ఆయన కుమారుడైన మొజ్తాబా ఖమేనీ గాయపడినట్లు వార్తలు వచ్చాయి. అయితే ఇన్నాళ్లుగా మౌనంగా ఉన్న ఆయన తొలిసారి ఇరాన్ ప్రజలను ఉద్దేశించి సందేశం పంపారు. అదే విధంగా అమెరికాతో పాటు దాని మిత్ర దేశాలు, పొరుగు దేశాలకు కూడా స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ఖమేనీ పంపిన సందేశాన్ని ఇరాన్ ప్రభుత్వ టీవీలో న్యూస్ ప్రజెంటర్ చదివి వినిపించారు.

# దేశంలోనే తొలి అటానమస్ షిప్ యార్డ్...

- మొదటి పేజి తరువాయి

పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను సందర్శించి, ప్రాజెక్ట్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాజెక్ట్ కోసం కూటమి ప్రభుత్వం జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ సమీపంలో 29.58 ఎకరాల భూమిని లీజు ప్రాతిపదికన కేటాయించింది. ఇందులో 7.58 ఎకరాల వాటర్ ఫ్రంట్ ల్యాండ్ కూడా ఉండటం విశేషం. మొదటి దశలో సాగర్ డిఫెన్స్ సంస్థ రూ.45 కోట్ల పెట్టుబడి పెట్టనుండగా, దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా వెయ్యి మందికి పైగా యువతకు ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. షిప్ బిల్డింగ్, అటానమస్ సిస్టమ్స్ డెవలప్‌మెంట్, మెరైన్ ఇంజనీరింగ్, పరిశోధన–అభివృద్ధి వంటి కీలక రంగాల్లో ఉపాధి లభిస్తుంది. 2026 నవంబర్ నాటికి ఈ కేంద్రంలో వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. భవిష్యత్తులో ఈ ప్రాజెక్టును మొత్తం 200 ఎకరాల్లో అభివృద్ధి చేయనున్నారు. ఈ కేంద్రం ఏర్పాటుతో బ్లూ ఎకానమీ, మారిటైం ఆవిష్కరణలు బలోపేతం కావడంతో పాటు, ఆంధ్రప్రదేశ్‌ను మారిటైం రోబోటిక్స్, అటానమస్ షిప్ బిల్డింగ్ హబ్‌గా నిలబెట్టాలన్నది ప్రభుత్వ లక్ష్యం. అంతకుముందు, జిల్లాకు విచ్చేసిన మంత్రి నారా లోకేశ్ కు బోగోలు మండలం కప్పరాలతిప్ప వద్ద నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రశాంతి రెడ్డి, దగుమాటి వెంకట కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, పులివర్తి నాని, బొజ్జల సుధీర్ రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, పి.సునీల్ కుమార్, ఎన్.విజయశ్రీ, ఏపీ మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్యనారాయణ, ఎమ్మెల్సీలు, సాగర్ డిఫెన్స్ సీఈవో కెప్టెన్ నికుంజ్ పరాశర్ తదితరులు పాల్గొన్నారు.

# పన్ను ఎగవేతదారులు తప్పించుకోవడానికి వీల్లేదు

రాష్ట్రంలో పన్ను ఎగవేతలను నిరోధించేందుకు పటిష్ఠమైన కార్యాచరణ చేపట్టాలని, ఇందుకోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి ఆధునిక సాంకేతికతను వినియోగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. అమరావతిలో కొనసాగుతున్న ఆరో జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో భాగంగా ఆయన ఆదాయార్జన శాఖలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పన్ను ఎగవేతలపై కఠినంగా వ్యవహరించాలని, అయితే పన్ను చెల్లింపుదారులను అనవసరంగా వేధించవద్దని స్పష్టం చేశారు.కొందరు కాంట్రాక్టర్లు తమ కార్యాలయాలను పొరుగు రాష్ట్రాల్లో ఏర్పాటు చేసుకొని, ఆంధ్రప్రదేశ్‌లో పనులు చేస్తున్నారని ముఖ్యమంత్రి అన్నారు. జాతీయ రహదారులు, రైల్వేలు, ఇతర ప్రాజెక్టుల పనులు చేస్తున్నప్పటికీ, వారి నుంచి రాష్ట్రానికి రావాల్సిన పన్నులు రావడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. టెండర్లు, వర్క్ ఆర్డర్లలో ఉన్న కాంట్రాక్టర్ల నుంచి ఆదాయం రాబట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయా ప్రాజెక్టుల కాంట్రాక్టర్లు చెల్లించే పన్నులు మన రాష్ట్ర ఖజానాకే చేరేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని గట్టిగా చెప్పారు."పారిశ్రామిక, సేవా రంగాల్లో వృద్ధి నమోదైతేనే ప్రభుత్వానికి పెద్ద ఎత్తున ఆదాయం వస్తుంది. ప్రతి రంగంలోనూ వృద్ధి సాధించడం ద్వారా నిర్దేశిత జీఎస్‌డీపీ లక్ష్యాన్ని చేరుకోవాలి" అని చంద్రబాబు అన్నారు. పన్ను ఎగవేతలకు పాల్పడి ఎవరూ తప్పించుకోవడానికి వీల్లేదని, చట్ట ప్రకారం ప్రతి ఒక్కరూ పన్నులు చెల్లించేలా చూడాలని ఆయన దిశానిర్దేశం చేశారు. పన్ను వసూళ్ల విషయంలో కఠిన వైఖరి అవలంబిస్తూనే, నిజాయితీపరులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు.

**ప్రతి లబ్ధిదారుడికి 'సంక్షేమ లేఖ'**

సూపర్ సిక్స్ సహా ఇతర సంక్షేమ పథకాల అమలులో పూర్తిస్థాయి పారదర్శకత తీసుకురావడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇకపై ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వం నుంచి అందుతున్న ప్రయోజనాలను వివరిస్తూ 'సంక్షేమ లేఖ' అందజేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, "ప్రతి నెలా ఏ కుటుంబానికి పెన్షన్, ఉచిత సిలెండర్, తల్లికి వందనం వంటి పథకాల ద్వారా ఎంత లబ్ధి చేకూరుతుందో స్పష్టంగా తెలియజేస్తూ లేఖ ఇవ్వాలి. దీనివల్ల ప్రభుత్వ పనితీరులో పారదర్శకతతో పాటు, లబ్ధిదారుల్లో పథకాలపై యాజమాన్య భావన పెరుగుతుంది" అని అన్నారు. సంక్షేమ పథకాల అమలుకు సంబంధించి త్వరలోనే ఒక క్యాలెండర్‌ను కూడా విడుదల చేయనున్నట్లు ప్రకటించారు.

"పెట్టుబడుల గురించి ఎలా ఆలోచిస్తున్నామో, అదే స్థాయిలో పేదల సంక్షేమం, వారి సాధికారత గురించి కూడా కలెక్టర్లు ఆలోచించాలి. సంపద సృష్టితో పాటు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ప్రభుత్వ ధ్యేయం" అని చంద్రబాబు స్పష్టం చేశారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణ పథకం కింద మార్చి 9 నాటికి 50.45 కోట్ల ప్రయాణాలు నమోదయ్యాయని, ఇందుకోసం ఆర్టీసీకి ప్రభుత్వం రూ.1,775 కోట్లు రీయింబర్స్ చేసిందని తెలిపారు.సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చూడాలని కలెక్టర్లకు సీఎం దిశానిర్దేశం చేశారు. ఉగాది నాటికి 2.5 లక్షల సామూహిక గృహప్రవేశాలు నిర్వహించాలని, ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి, ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. అభివృద్ధి, సంక్షేమాన్ని సమతూకంగా ముందుకు తీసుకెళ్లాలని ఆయన అధికారులకు సూచించారు.

# వడగాలుల వల్ల ఒక్క మరణం కూడా జరగడానికి వీల్లేదు

ఈసారి వేసవి తీవ్రత ఎక్కువగా ఉంటుందన్న అంచనాల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. వడగాలుల కారణంగా రాష్ట్రంలో ఒక్క మరణం కూడా సంభవించకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను గట్టిగా ఆదేశించారు. అమరావతిలో రెండో రోజు కొనసాగుతున్న 6వ జిల్లాల కలెక్టర్ల సదస్సులో ఆయన వైద్యారోగ్యం, వేసవి ప్రణాళికలపై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. వేసవిలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఎండలో పనిచేసే ఉపాధి హామీ కూలీల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, పశువుల కోసం నిర్మించిన నీటి తొట్టెలను నిరంతరం నీటితో నింపాలని ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో అమలవుతున్న పశు బీమా పథకాన్ని సమర్థంగా అమలు చేయాలన్నారు.

వైద్యారోగ్య రంగంపైనా సీఎం పలు కీలక సూచనలు చేశారు. కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో వైద్య పరీక్షలు చేసే వ్యవస్థలను అందుబాటులోకి తేవడాన్ని అభినందించారు. తక్కువ ఖర్చుతో, సులభంగా తరలించగలిగే వైద్య పరికరాలను తయారు చేయాలని సూచించారు.

మారుమూల ప్రాంతాలకు సైతం 108 అంబులెన్సులు వేగంగా చేరుకునేలా రూట్ ఆప్టిమైజేషన్ చేయాలని ఆదేశించారు. రియల్ టైమ్ గవర్నెన్స్ హబ్ (ఆర్టీఐహెచ్) ద్వారా మరిన్ని ఆవిష్కరణలు చేసి ప్రజారోగ్యాన్ని మెరుగుపరచాలని కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు.

# వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి అనుచరుడి అరెస్ట్

వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రధాన అనుచరుడు కర్నాటి వీరభద్రరావును విజయవాడ పటమట పోలీసులు ఈరోజు అరెస్టు చేశారు. ఏపీ హైకోర్టు అడ్వకేట్‌ను కిడ్నాప్ చేసి, నిర్బంధించి హింసించినట్లు నమోదైన కేసులో వీరభద్రరావును ఏ–1గా పోలీసులు చేర్చారు.కేసు వివరాల్లోకి వెళితే... 2023 నవంబర్ 7వ తేదీన హైకోర్టు అడ్వకేట్‌ను అక్రమంగా నిర్బంధించి, తీవ్రంగా హింసించినట్లు ఆరోపణలు ఉన్నాయి. తనపై దొంగ కేసులు పెట్టి, కిడ్నాప్ చేసి, ప్రాణభయం చూపించి బలవంతంగా ఆస్తులు రాయించుకున్నారని సదరు అడ్వకేట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కిడ్నాప్ ఉదంతంలో అప్పటి డీఎస్పీ పల్లంరాజు, ఎస్ఐ రబ్బానీ నిందితులకు సహకరించినట్లు విచారణలో తేలింది. వీరు ఇప్పటికే శాఖాపరమైన చర్యల్లో భాగంగా సస్పెన్షన్‌లో ఉన్నారు. ఈ కేసులో కర్నాటి వీరభద్రరావుతో పాటు కర్నాటి సతీశ్‌లపై కూడా తీవ్రమైన అభియోగాలు ఉన్నాయి. వీరిద్దరూ పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి అత్యంత సన్నిహితులుగా పేరు పొందారు. వీరభద్రరావు అరెస్టుతో ఈ కేసులో కీలక పురోగతి లభించినట్లయింది. మరో నిందితుడు కర్నాటి సతీశ్ కోసం పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ కేసులో విజయవాడ పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

# ఇఫ్తార్ విందులు సరే.. రంజాన్ తోఫా ఏది?

ప్రభుత్వం ఇచ్చే ఇఫ్తార్ విందులు బాగానే ఉన్నాయని, కానీ పేద ముస్లింలకు ఇస్తానన్న 'రంజాన్ తోఫా' సంగతేంటని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ముఖ్యమంత్రి చంద్రబాబును సూటిగా ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 'చంద్రన్న తోఫా' ఇస్తామని చెప్పి, రెండేళ్లుగా ఎందుకు అమలు చేయడం లేదని ఆమె నిలదీశారు.

ఈ సందర్భంగా షర్మిల సోషల్ మీడియాలో స్పందిస్తూ... "రూ.3 లక్షల కోట్ల బడ్జెట్ ఉన్న ప్రభుత్వానికి, 12 లక్షల పేద ముస్లిం కుటుంబాలకు తోఫా ఇవ్వడానికి అవసరమైన రూ.65 కోట్లు బరువయ్యాయా?" అని విమర్శించారు. గతంలో తోఫా ఇవ్వనందుకు జగన్‌కు ముస్లింలు బుద్ధి చెప్పారని, ఇప్పుడు మీకు ఎలా చెప్పాలో ఆలోచించాల్సి వస్తుందని వ్యాఖ్యానించారు.కూటమి ప్రభుత్వం చెబుతున్న మైనారిటీ సంక్షేమం అంతా బూటకమని షర్మిల ఆరోపించారు. "చంద్రబాబు ప్రధాని మోదీకి వణుకుతున్నారు. బీజేపీకి, ఆర్ఎస్ఎస్ భావజాలానికి ముఖ్యమంత్రి గులాంగిరీ చేస్తున్నారు. మైనారిటీలకు నిధులిస్తే తమ సంక్షేమం ఎక్కడ ఆగిపోతుందోనని భయపడుతున్నారు"

అని ఆమె తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. చంద్రబాబుకు మైనారిటీల అభివృద్ధిపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే, తక్షణమే పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫాను పంపిణీ చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

# ఫరూక్ అబ్దుల్లాపై నాన్ బెయిలబుల్ వారెంట్

జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లాకు శ్రీనగర్ కోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. జమ్మూకశ్మీర్ క్రికెట్ అసోసియేషన్ (జేకేసీఏ) నిధుల దుర్వినియోగం కేసులో ఆయనపై గురువారం నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయింది. ఈ కేసు విచారణలో భాగంగా వ్యక్తిగత హాజరు నుంచి తనకు మినహాయింపు ఇవ్వాలని ఫరూక్ అబ్దుల్లా దాఖలు చేసిన పిటిషన్‌ను శ్రీనగర్ చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు తిరస్కరించింది. తక్షణమే ఆయనపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఈ కేసుకు సంబంధించిన తదుపరి విచారణను మార్చి 30వ తేదీకి వాయిదా వేసింది. జేకేసీఏలో జరిగిన ఆర్థిక అవకతవకలకు సంబంధించిన ఈ కేసులో నిందితులపై అభియోగాల నమోదు ప్రక్రియ కోసం గురువారం కోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగానే న్యాయస్థానం ఈ కీలక ఆదేశాలు జారీ చేసింది. జేకేసీఏ అధ్యక్షుడిగా ఫరూక్ అబ్దుల్లా ఉన్న సమయంలో క్రికెట్ అభివృద్ధి కోసం కేటాయించిన నిధులను పక్కదారి పట్టించారని, భారీగా దుర్వినియోగం జరిగిందని ప్రధాన ఆరోపణగా ఉంది. ఈ కుంభకోణంపై ఇప్పటికే దర్యాప్తు చేపట్టిన కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ), ఫరూక్ అబ్దుల్లాతో పాటు పలువురిపై రణబీర్ పీనల్ కోడ్ (ఆర్‌పీసీ)లోని సెక్షన్ 120–బి (కుట్ర), 406 (విశ్వాసఘాతుకం), 409 (ప్రభుత్వ ఉద్యోగిగా నిధుల దుర్వినియోగం) కింద ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది.

ఫరూక్ అబ్దుల్లాతో పాటు జేకేసీఏ మాజీ అధికారులు అహ్సాన్ అహ్మద్ మీర్జా, మహ్మద్ సలీం ఖాన్, బషీర్ అహ్మద్ మిస్గర్‌లను కూడా సీబీఐ నిందితులుగా చేర్చింది. కోట్లాది రూపాయల నిధులు పక్కదారి పట్టినట్టు దర్యాప్తులో తేలిందని సీబీఐ తన ఛార్జ్‌షీట్‌లో పేర్కొంది. చాలాకాలంగా కొనసాగుతున్న ఈ కేసులో, తాజా కోర్టు ఆదేశాలతో విచారణ ప్రక్రియ వేగవంతం కానుంది.

# సీఎం చంద్రబాబు అభినందించడం పట్ల ఆనందం వ్యక్తం చేసిన మంత్రి కందుల దుర్గేశ్

- మొదటి పేజి తరువాయి

పార్క్ ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చినట్లు వెల్లడించారు.

ఈ పర్యటనలోనే ఏఐ ఆధారిత సినిమా, స్కిల్ డెవలప్‌మెంట్ అవకాశాలపై యూరోస్ సంస్థ ప్రతినిధులతో ఫలప్రదమైన చర్చలు జరిపినట్లు దుర్గేశ్ వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశంతో అమరావతిలో 'క్రియేటివ్ సిటీ'ని ఏర్పాటు చేసి, రాష్ట్రంలో క్రియేటివ్ ఎకానమీకి కొత్త అవకాశాలు సృష్టించేందుకు అన్ని రకాలుగా కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

# ఇది ప్రారంభం మాత్రమే... గ్యాస్ కొరతతో దేశం అల్లాడుతోంది

- మొదటి పేజి తరువాయి

విషయంలో తీవ్ర సవాళ్లు ఎదుర్కోబోతోందని హెచ్చరించారు. గ్యాస్ కొరతతో దేశం అల్లాడుతోంది... ఇది ప్రారంభం మాత్రమే అని అన్నారు. ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం తక్షణమే మేల్కొని, తగిన ఏర్పాట్లు చేయాలని గురువారం డిమాండ్ చేశారు.పార్లమెంట్ వెలుపల విలేకరులతో మాట్లాడిన రాహుల్ గాంధీ, దేశంలో నెలకొన్న గ్యాస్, ఎల్పీజీ పరిస్థితిపై సభలో మాట్లాడేందుకు తాను ప్రయత్నించగా, తనకు అనుమతి లభించలేదని తెలిపారు. "సాధారణంగా సభలో మాట్లాడటానికి ఒక పద్ధతి ఉంటుంది. కానీ ఇప్పుడు కొత్త విధానం మొదలైనట్లుంది. నేను మాట్లాడాలనుకున్న అంశంపై ముందు మంత్రి నిర్ణయిస్తారు, ఆ తర్వాతే నేను మాట్లాడాలి. మళ్ళీ ఆ తర్వాత మంత్రి స్పందిస్తారు. ఈ కొత్త పద్ధతి ఆశ్చర్యంగా ఉంది" అంటూ ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ, "రాబోయే రోజుల్లో గ్యాస్, పెట్రోల్, అన్ని రకాల ఇంధనాలు పెద్ద సమస్యగా మారనున్నాయి. ఎందుకంటే మన ఇంధన భద్రత దెబ్బతింది. ప్రభుత్వ లోపభూయిష్ట విదేశాంగ విధానం ఈ సమస్యను సృష్టించింది. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రధాని మోదీ మేల్కొని సన్నాహాలు ప్రారంభించాలి. లేకపోతే కోట్లాది మంది ప్రజలు తీవ్రంగా ప్రభావితమవుతారు" అని స్పష్టం చేశారు.ఈ సమస్య కేవలం ఇరాన్ వంటి దేశాలు ఇంధన సరఫరాను అనుమతిస్తాయా లేదా అనేదాని కంటే చాలా పెద్దదని రాహుల్ అన్నారు. "మనం ఒక అస్థిరమైన కాలంలోకి అడుగుపెడుతున్నాం. భవిష్యత్తులో ఎలాంటి పరిస్థితులు ఎదురైనా మన ప్రజలు ఇబ్బంది పడకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది" అని తెలిపారు.తాను చేస్తున్నది రాజకీయ విమర్శ కాదని, రాబోయే పెను ప్రమాదం గురించి కేవలం హెచ్చరిస్తున్నానని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. "ఇది రాజకీయ ప్రకటన కాదు. నా కళ్లకు ఓ పెద్ద సమస్య కనిపిస్తోంది. ప్రపంచం మారుతోంది, దాని నిర్మాణం కూడా మారుతోంది. కాబట్టి మనం కూడా మన ఆలోచనా ధోరణిని మార్చుకోవాలి. స్పష్టతతో పనిచేయకపోతే, మారుతున్న ప్రపంచంలో భారత్‌ను 'కేంద్రంగా' నిలపకపోతే సమస్యలు తప్పవు" అని ఆయన పేర్కొన్నారు.

# హార్ముజ్ మీదుగా భారత్ వచ్చే నౌకల ప్రయాణంపై ఇరాన్‌తో చర్చించాం

- మొదటి పేజి తరువాయి

పరిగణ నలోకి తీసుకుంటోందని అన్నారు.ఇరాన్‌లో ప్రస్తుతం సుమారు 9 వేల మంది భారతీయులు ఉన్నారని ఆయన వెల్లడించారు. ఇందులో విద్యార్థులు, నౌక సిబ్బంది, వ్యాపారవేత్తలు, యాత్రికులు ఉన్నట్లు తెలిపారు. ఇరాన్, అమెరికా–ఇజ్రాయెల్ యుద్ధం మొదలైనప్పటి నుంచి అక్కడి భారతీయులను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు చెప్పారు. స్వదేశానికి తిరిగి రావాలనుకునే భారతీయులందరికీ సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. మన రాయబార కార్యాలయం అన్ని సమయాల్లో అందుబాటులో ఉంటుందని అన్నారు.ఆఫ్ఘనిస్థాన్‌తో ఘర్షణకు భారత్ కారణమని పాకిస్థాన్ ఆరోపణలు చేయడంపై రణధీర్ జైశ్వాల్ స్పందించారు. పాకిస్థాన్‌వి నిరాధార ఆరోపణలని అన్నారు. తమ తప్పిదాలను కప్పిపుచ్చుకోవడానికి భారత్‌పై నిందలు వేయడం పాకిస్థాన్‌కు అలవాటే అన్నారు. దశాబ్దాలుగా సీమాంతర ఉగ్రవాదాన్ని పాకిస్థాన్ పెంచి పోషిస్తోందని మండిపడ్డారు.

పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

# కల్తీ పాల ఘటనలో 14 వ మృతి

**రాజమహేంద్రవరం, పెన్ పవర్ మార్చి 12:**నగరం లో ఇటీవల జరిగిన పాలు కల్తీ ఘటనకు సంబంధించి ఆరోగ్య సమస్యలతో కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీమతి బండారు వీరలక్ష్మి (60) గురువారం తీవ్రమైన మూత్రపిండ వైఫల్యంతో మరణించినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. కె. వెంకటేశ్వరరావు తెలిపారు. మృతురాలి కుటుంబ సభ్యులకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ తరపున ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఘటనలో 14 మంది మృతి చెందారు. ప్రస్తుతం మొత్తం 7 మంది రోగులు వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని తెలిపారు. మిగిలిన రోగుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులు నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన అన్ని వైద్య చర్యలు కొనసాగిస్తున్నట్లు చెప్పారు.

రోగులు సంబంధిత నిపుణుల వైద్యుల పర్యవేక్షణలో సముచిత వైద్య చికిత్స పొందుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని డా. కె.వెంకటేశ్వ రరావు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సూచనల ప్రకారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

# వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి.



మాజీ మంత్రి వనిత.

**గోపాలపురం,పెన్ పవర్, ఫిబ్రవరి 12.**వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు నాయకులు కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని ఆ పార్టీ గోపాలపురం నియోజకవర్గ ఇన్చార్జ్, మాజీ మంత్రి తానేటి వనిత అన్నారు. పార్టీ ఆవిర్భావ కార్యక్రమం దేవరపల్లి మండలం యర్నగూడెం గ్రామంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను వనిత ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ ప్రతిష్టకు ప్రతి ఒక్కరు శక్తి వంచన లేకుండా కృషి చేయాలి అన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అలాగే ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను సైతం ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. ముఖ్యంగా నాయకులు కార్యకర్తలు గ్రామస్థాయి నుండి పార్టీని బలోపేతం చేయాలన్నారు. నాయకులు కార్యకర్తలకు మనోధైర్యం ఇస్తూ వారికి అండగా ఉండి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో దేవరపల్లి ఎంపీపీ కేవీకే దుర్గారావు, గోపాలపురం మండల పార్టీ అధ్యక్షులు వెలగా శ్రీరామమూర్తి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కూసం రామ్మోహన్ రెడ్డి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తూర్పుగోదావరి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు సాలి వేణు, దేవరపల్లి మండల పార్టీ అధ్యక్షులు కె సతీష్, నరహరిశెట్టి రాజేంద్రప్రసాద్, నియోజకవర్గంలోని నాలుగు మండలాల కు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వచ్చే సారి విజయదుందుభి మోగిస్తాం

- మాజీ ఎంపీ మార్గాని భరత్
- 16వ వసంతం వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 12**

సిటీ నియోజకవర్గ వైయస్ఆర్‌సీపీ సమన్వయకర్త, జాతీయ అధికార ప్రతినిధి మాజీ ఎంపి మార్గాని భరత్ రామ్ కార్యాలయం లో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 16వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. జగన్ పాలనే మళ్ళీ వస్తుందని రాష్ట్ర సి.ఈ.సి సభ్యులు, మాజీ రుడా చైర్మన్ రౌతు సూర్య ప్రకాశరావు అన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల బీసీ జేఏసీ గౌరవ అధ్యక్షులు మార్గాని నాగేశ్వరరావు , పార్లమెంట్ సమన్వయ కర్త డాక్టర్ గూడూరు శ్రీనివాస్, రాష్ట్ర పార్టీ సంయుక్త కార్యదర్శి గుర్రం గౌతం రామ్, సీనియర్ ట్రేడ్ యూనియన్ నాయకులు వాసంశెట్టి గంగాధర రావు, దాసి వెంకటరావు, , సప్ప ఆదినారాయణ, మార్తి నాగేశ్వరరావు,ఆరే చిన్ని, పీత రామకృష్ణ, కృష్ణ వేణి, అనంతలక్ష్మి పాల్గొన్నారు.



వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించి 15 ఏళ్లు పూర్తి చేసుకుని 16వ వసంతంలోకి అడుగుపెడుతున్న శుభసందర్భాన్ని పురస్కరించుకుని గురువార సిటీ లో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా వేడుకలు నిర్వహించారు. స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం పార్టీ శ్రేణులు మిఠాయిలు పంపిణీ చేస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ . ఆవిర్భావం నుంచి పార్టీ సృష్టించిన చరిత్రను వివరిస్తూ, 2019-24 లో ముఖ్యమంత్రిగా వైయస్ జగన్ మోహన్ రెడ్డి కులమతాలకు, వర్గాలకు అతీతంగా అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలను అందించారని కొనియాడారు. రానున్న రోజుల్లో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తిరిగి విజయదుందుభి మోగిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సిటీ వివిధ విభాగాల అధ్యక్షులు, వార్డు ఇంచార్జీలు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సనాతనధర్మ పరిరక్షణకే జాతర: ఎమ్మెల్యే బొలిశెట్టి





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. మార్చి 12.** సనాతన ధర్మ పరిరక్షణ కోసమే శ్రీ బలుసులమ్మ అమ్మవారి జాతరను వైభవోపేతంగా నిర్వహిస్తున్నామని శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెం గ్రామదేవత శ్రీ శ్రీ శ్రీ బలుసులమ్మ అమ్మవారి జాతర మహోత్సవాన్ని ఆలయ అర్చకులు గురువారం శాస్త్రోక్తంగా ప్రారంభించారు. ప్రారంభోత్సవంలో భాగంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సతీ సమేతంగా అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే సొంత నిధులు, దాతల సహకారంతో బొలిశెట్టి శ్రీనివాస్ 50 గ్రాములు మారిశెట్టి పోతురాజు 15 గ్రాములు చీ మణికంఠ 10 గ్రాములు మొత్తం 75 గ్రాముల తో అమ్మ శ్రీ చక్ర సహిత బంగారు కంటాభరణం చేయించిన బంగారు ఆభరణాన్ని అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడేపల్లిగూడెం ప్రజలందరి క్షేమం, శాంతి,సౌభాగ్యాల కోసం, సనాతన ధర్మ పరిరక్షణ లక్ష్యం గా అమ్మవారి జాతరను వైభవోపేతంగా నిర్వహిస్తున్నామని అన్నారు. అన్ని మతాలకు చెందిన ప్రజలు ఈ జాతరలో భాగస్వాములు కావాలని కోరారు. తాను అన్ని మతాలను గౌరవిస్తానని, హిందూ సంప్రదాయాలను పాటిస్తానని అన్నారు. 2014లో జాతర నిర్వహించామని 12 ఏళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడు జాతర నిర్వహించే మహాభాగ్యం తనకు కలిగిందని అన్నారు. తాడేపల్లిగూడెం లో ప్రతి కుటుంబం సుసంపన్నంగా, క్షేమంగా ఉండటానికి ప్రతి ఐదు సంవత్సరాలకు బలుసులమ్మవారి జాతర జరిగే విధంగా కృషి చేయాలన్నారు. అత్యున్నత సంప్రదాయాలకు పుట్టినిల్లయిన భారత దేశంలో జాతర అనేది ఒక గొప్ప ఆధ్యాత్మిక చైతన్యాన్ని కలిగించే మహా ఉత్సవం అని అన్నారు.అమ్మవారి కృపతో ప్రతి మనిషి ఆధ్యాత్మిక, ధార్మిక ప్రవృత్తితో జీవించాలని కోరారు. జాతర నిర్వహిస్తున్నామని ప్రకటించగానే ఎంతోమంది అమ్మవారి భక్తులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విరాళాలు ప్రకటించడం అభినందనీయమన్నారు. ఆర్థిక స్తోమత లేని వారు ఉత్సవాల నిర్వహణలో సేవలు అందించడం ద్వారా అమ్మవారి ఆశీస్సులు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహణ అధికారి చంద్రశేఖర్, ఆలయ ఉత్సవాల నిర్వహకుడు అంజిబాబు, మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు, డి.ఎస్.పి విశ్వనాథ్,బొలిశెట్టి రాజేష్, మారిశెట్టి పోతురాజు కుటుంబ సభ్యులు, తోటరాజా, ఈతకోట తాతాజీ,పాలూరి వెంకటేశ్వరరావు, వర్తనపల్లి కాశి, చాపల రమేష్, మద్దాల మణికుమార్,పైబోయిన వైదేహి, గొర్రెల శ్రీధర్ దంపతులు, పుల్లా బాబి, రుద్రా రమేష్, నల్లగంచి రాంబాబు, ఘట్టం సింధు,దేతిన గిరిధర్, పసల కొండబాబు, గట్టెం నాని,, బైన పాలపు ముఖేష్, అడ్డగర్ల సురేష్, పసుమర్తి రామ లక్ష్మణ్ పట్నాల రాంపండు, వాడపల్లి సుబ్బరాజు, మలపాక చిట్టి, ఆకాశపు స్వామి, సింగం సుబ్బారావు, కూటమి నాయకులు కార్యకర్తలు వీర మహిళలు ప్రభుత్వ అధికారులు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# గత 20నెలల్లో నగర నియోజక వర్గంలో 510 సీఎం ఆర్ ఎఫ్ చెక్కులు

- రూ 4. 40 కోట్లు లబ్దిదారులకు పంపిణీ
- సీఎం ఆర్ ఎఫ్ చెక్కుల పంపిణీ లో మీడియాతో ఎమ్మెల్యే వాసు

**రాజమహేంద్రవరం పెన్ పవర్, మార్చి 12 :**ప్రతీ చిన్న అంశాన్ని శవ రాజకీయాలు చేయడమే వైసిపి పనిగా పెట్టుకోవడమే వారి నైజమని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గడిచిన 20నెలల్లో 510మంది లబ్ధిదారులకు సీఎం ఆర్ ఎఫ్ చెక్కుల రూపంలో రూ 4.40 కోట్ల అందించడం నిదర్శనమన్నారు. స్థానిక లలితానగర్‌లోని ఫారెస్ట్ కల్యాణ మండపంలో 62 మందికి సి ఎం ఆర్ రఫ్ చెక్కులు, రెండు ఎల్ ఓ సి లు కలిపి రూ. 42 లక్షల 89వేల 541 లు ఇచ్చారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ హయాంలో చెక్కులు రాక నిర్లక్ష్యానికి గురైన 8మందికి కూడా రూ 6,48,288ల చెక్కులు ఇచ్చమన్నారు. రెండు ఎల్ ఓ సి లకు రూ 9,52,810 లు ఇచ్చామని ఎమ్మెల్యే వాసు చెప్పారు. ఇంకా 105మందికి రూ 2,11,02,143 లు రావాల్సి ఉందన్నారు. వైసిపి హయాంలో రాష్ట్రంలో సీఎం ఆర్ ఎఫ్ చెక్కు ఇవ్వలేక పోయారని వాసు ఎద్దేవా చేసారు. ఒక పాల వ్యాపారి నిర్లక్ష్యం కారణంగా పాల కల్తీ వలన , అతడి తప్పు వలన కొంతమంది ప్రాణాలు కోల్పోయారని ఎమ్మెల్యే వాసు ఆవేదన చెందారు. శవరాజకీయాలు చేయడం శోచనీయమని విమర్శించారు. అధికారంలో ఉన్నపుడు ఇసుక, మద్యం, కబ్జా చేసిన దాంట్లో నుంచి రూ 10లక్షల చొప్పున ఇద్దామని జగన్ దగ్గరికి వెళ్లి ఎందుకు అడగలేకపోతున్నారని, ఎమ్మెల్యే వాసు ప్రశ్నించారు. విశాఖలో గూగుల్ రాకూడదని వైసిపి వాళ్ళు అడ్డుపడడం విమర్శించారు. వైసిపి హయాంలో రెచ్చిపోయిన రౌడీషీటర్ల పని పడుతున్నామని, శాంతిభద్రతలను కాపాడేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన చెప్పారు. ఈ మీడియా సమావేశంలో కూటమి నాయకులు కుడుపూడి సత్తిబాబు, , అత్తి సత్యనారాయణ, కాశీ నవీన్ కుమార్, నక్కా చిట్టిబాబు, పిక్కి నాగేంద్ర, , కంటిపూడి శ్రీను, ఉప్పులూరి జానకి రామయ్య, జక్కంపూడి అర్జున్, మరుకుర్తి రవి యాదవ్, , , అగురు ధన్ రాజ్, చొప్పర్ల భద్రరావు, చింతపల్లి నాని, , ద్వారా పార్వతి సుందరి, కోసూరి చండీప్రియ, కప్పల వెలుగు కుమారి, సయ్యద్ అప్పరి, పాలవలస భద్రం, బంగారు నాగేశ్వరరావు, బండారు శ్రీను, బొర్రా చిన్ని, ఈతలపాటి రవి, సలాది ఆనంద్, యాళ్ల శ్రీను, , కానేటి కృపామణి, వానపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# మహిళలు ధైర్యంగా సమస్యలు తెలియజేయాలి

**జన్ సున్వాయ్ లో 14 అర్జీలు స్వీకరణ, 25 పెండింగ్ అర్జీలు పరిష్కారం**

**చైర్ పర్సన్ రాయపాటి శైలజ**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 12 :**మహిళలకు సత్వర న్యాయం అందించాలనే ఉద్దేశంతో మహిళా జన్ సున్వాయి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, మహిళలు తమ సమస్యలను ధైర్యంగా తెలియజేయాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ రాయపాటి శైలజ కోరారు. గురువారం స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహంలో రాష్ట్ర మహిళా కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా జన్ సున్వాయి కార్యక్రమానికి హాజరైన అనంతరం ఆమె మీడియా తో మాట్లాడారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం ను సందర్భంగా ఈ నెల 9 నుండి 13 వరకు దేశవ్యాప్తంగా మహిళా జన్ సున్వాయి కార్యక్రమాలు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటికే నెల్లూరు, గుంటూరు, విజయవాడలో నిర్వహించామని, శుక్రవారం విశాఖపట్నంలో నిర్వహిస్తున్నమన్నారు. మహిళల రక్షణ, న్యాయం కోసం జన్ సున్వాయ్ కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా 13 ఉమ్మడి జిల్లాల పరిధిలో నిర్వహిస్తున్నామని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ రాయపాటి శైలజ తెలియ చేశారు.

కమిషన్‌కు వచ్చిన ఫిర్యాదులపై సంబంధిత శాఖల చర్యలను సమీక్షించి, బాధితులతో మాట్లాడి సమస్యలను పరిష్కారమైన కేసులను ముగిస్తున్నామని తెలిపారు.కుటుంబ సమస్యలు, మహిళలపై వేధింపులు, ఆస్తి తగాదాలపై అర్జీలు అందినట్లు తెలిపారు. సఖి వన్ స్టాప్ సెంటర్ టోల్ ఫ్రీ నంబర్ 181 పై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. పోలీసు, న్యాయశాఖ, స్త్రీ శిశు సంక్షేమం తదితర శాఖలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి బాధితులకు త్వరితగతిన న్యాయం అందించడం ముఖ్య ఉద్దేశమన్నారు.ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ టి . శ్రీదేవి, కోనసీమ అదనపు ఎస్పీ ప్రసాద్, కాకినాడ ఎస్‌బీ డీఎస్పీ కె.వి. సత్యనారాయణ, రాజమహేంద్రవరం ఉమెన్ పోలీస్ స్టేషన్ సీఐ మంగాదేవి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# గోకవరం లో వైయస్సార్ సి పి 16 వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు





**గోకవరం పెన్ పవర్ మార్చి 12 :--** మండలంలోని పలు గ్రామాల్లో వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ 16 వ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. గోకవరం, కృష్ణుని పాలెం, తంటికొండ రంపఎర్రంపాలెం,కొత్త పల్లి, మల్లవరం, ఇంటికాయలపల్లి ఇలా పలు గ్రామాలలో వైఎస్ఆర్సిపి జండాలు ఎగరవేసి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి కి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వైసిపి నాయకులు మాట్లాడుతూ డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి మరణానంతరం ఎన్నో కష్ట నష్టాలను ఎదుర్కొని 16 నెలల పాటు జైలు జీవితాన్ని అనుభవించి పేద ప్రజల బ్రతుకు కోసం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ స్థాపించి నాయకుడు లేని సమాజాన్ని నేర్పించిన ఏకైక మహోన్నత వ్యక్తి మన మజీ ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డి అనేలా పాలన అందించారన్నారు. నేడు అమలవుతున్న రెడ్బుకు రాజ్యాంగానికి కాలం అది తనలోనే చెల్లుతుందని మన జగనన్నను మరోసారి ముఖ్యమంత్రి చేసుకుని మన రాష్ట్రాన్ని మన బ్రతుకులను బాగు చేసుకోవాలని పిలుపునిచ్చారు.

## రంపచోడవరం మండలంలో ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక





**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, మార్చి 12:**మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంఎన్ఆర్ఈజీఎస్) కింద 202425 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సామాజిక తనిఖీ ప్రజావేదికను రంపచోడవరం మండలంలో నిర్వహించినట్లు పోలవరం జిల్లా ఏపిడి వెంకటేశ్వరరావు తెలిపారు.గురువారం రంపచోడవరం ఎంపీడీవో కార్యాలయంలో ఆయన అధ్యక్షతన ఈ ప్రజావేదిక జరిగింది. ఈ సందర్భంగా ఏపిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులు, వాటికి సంబంధించిన రికార్డులు, కార్మికులు చేసిన పనికి వేతనాలు సక్రమంగా అందాయా లేదా అనే అంశాలపై సామాజిక తనిఖీ నిర్వహించినట్లు తెలిపారు.సోషల్ ఆడిట్ బృందం గ్రామాల వారీగా వెళ్లి పనుల వివరాలు, గ్రామ సభ తీర్మానాలు, కార్మికులకు చెల్లించిన వేతనాలు, నిధుల వినియోగంపై పరిశీలించి నివేదికలు సమర్పించిందన్నారు. ఆ నివేదికల ఆధారంగా ప్రజావేదిక నిర్వహించి ఎటువంటి జాప్యం లేకుండా తనిఖీలు చేపట్టినట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి.వి.వి.సి. ప్రసాద్, వైస్ ఎంపీపీలు బాలకృష్ణ, కుంజం వంశీకృష్ణ, ఎంపీటీసీ ఉలవల లక్ష్మి, డిపిఎం దుర్గాప్రసాద్, ఏపిఓ బి. సత్యనారాయణ, ఏపిడి రాంబాబు, ఎస్ఆర్పి అచ్చుతరావు, టెక్నికల్ అసిస్టెంట్లు, డిఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

## మారుమూల గ్రామాల అభివృద్ధిపై సమీక్ష





**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, మార్చి 12 :-** పోలవరం జిల్లాలోని మారుమూల గ్రామాలకు మౌలిక సదుపాయాలను మెరుగుపరచేందుకు చర్యలు చేపట్టాలని రంపచోడవరం శాసనసభ్యులు, లెజిస్లేటివ్ చైర్పర్సన్ మిరియాల శిరీషాదేవి, రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎస్. బొజ్జిరెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ స్మరణ రాజ్ కు సూచించారు.గురువారం రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కార్యాలయంలో పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్‌తో వారు వేరువేరుగా సమావేశమై జిల్లాలోని 12 మండలాల పరిధిలో ఉన్న గ్రామాల అభివృద్ధిపై చర్చించారు. ముఖ్యంగా ఈ వేసవి కాలంలో గ్రామాల్లో త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రతి గ్రామానికి తగిన విధంగా త్రాగునీటి సరఫరా ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు.అదేవిధంగా మారుమూల గ్రామాలకు వెళ్లే రహదారుల అభివృద్ధిపై కూడా ప్రత్యేకంగా చర్చించి, ప్రజలకు రాకపోకలు సౌకర్యంగా ఉండేలా అవసరమైన పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.జిల్లాలోని గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## మత్స్య సంపద అభివృద్ధికి ప్రభుత్వాల ప్రాధాన్యం

### ముసురుమిల్లి జలాశయంలో చేప పిల్లల విడుదల






**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, మార్చి 12:**పోలవరం జిల్లాలో మత్స్య సంపద అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నాయని రంపచోడవరం శాసనసభ్యులు, లెజిస్లేటివ్ చైర్పర్సన్ మిరియాల శిరీషాదేవి, జిల్లా జాయింట్ కలెక్టర్ స్మరణ రాజ్ తెలిపారు.

గురువారం ముసురుమిల్లి జలాశయంలో చేప పిల్లలను వదిలే కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ స్మరణ రాజ్ తో కలిసి ఆమె చేప పిల్లలను ముసిరిమిల్లి జలాశయంలో వదిలారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి మాట్లాడుతూ జిల్లాలోని గిరిజన మత్స్య రైతుల అభివృద్ధికి దర్తీ ఆబా జనజాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ పథకం ద్వారా 90 శాతం సబ్సిడీతో చేప పిల్లలను సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ముసురుమిల్లి, నేలకోట, మగలిగడ్డ, బండకొండ, సూరంపాలెం జలాశయాల్లో మొత్తం 2 లక్షల 74 వేల 500 చేప పిల్లలను వదిలి మత్స్య సంపదను పెంపొందించే చర్యలు తీసుకున్నామని చెప్పారు.ఇప్పటికే ఫిబ్రవరి 7న పీఎంఎంఎస్వై పథకం ద్వారా ఐదు జలాశయాల్లో 60 వేల చేప పిల్లలను వదిలినట్లు తెలిపారు. అదే జలాశయాల్లో రెండో విడతగా 79,800 చేప పిల్లలను ఈరోజు వదిలినట్లు ఆమె పేర్కొన్నారు.పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ మాట్లాడుతూ జిల్లాలోని గిరిజన మత్స్య రైతులు ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం నిరంతరం చర్యలు చేపడుతోందని చెప్పారు. జలాశయాల పరిధిలో గిరిజన మత్స్య రైతులు సొసైటీలు ఏర్పాటు చేసుకుని చేపల పెంపకాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. అలాగే జలాశయాల ద్వారా వచ్చే ఆదాయంలో కొంత భాగాన్ని గ్రామాల అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించుకోవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో పోలవరం జిల్లా మత్స్యశాఖ అధికారి ఎస్.కె. దిల్షాద్, డీఎఫ్‌సీఎస్ వైస్ ప్రెసిడెంట్ బోలా నాగేశ్వరరావు, ఏబీడీవో అనిల్ కుమార్, అబ్జర్వర్ టి. సంతోష్, వీఎఫ్ఏలు, ఉమ్మడి ప్రభుత్వ నాయకులు స్వప్న కుమారి, అడబాల బాపిరాజు, గణపతి, ఫీల్డ్‌మెన్, జలాశయాల కమిటీ అధ్యక్షులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా



**పెన్ పవర్, ఉంగుటూరు మార్చి 12:**వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉంగుటూరు మండలంలో ఆ పార్టీ శ్రేణులు గురువారం ఘనంగా సంబరాలు నిర్వహించారు. మండల కన్వీనర్ మరడ మంగారావు ఆధ్వర్యంలో నారాయణపురం, ఉంగుటూరు, చేబ్రోలు సహా పలు గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మరడ మంగారావు ముఖ్య అతిథిగా పాల్గొని పార్టీ జెండా ఎగరవేసి కేక్ కట్ చేసి కార్యకర్తలతో కలిసి వేడుకలు జరుపుకున్నారు.

నారాయణపురం గ్రామ పార్టీ అధ్యక్షులు పైడి అరుణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉంగుటూరు మాజీ ఏఎంసీ చైర్మన్ మరడ రమావతి, ఎంపీటీసీలు అరవెల్లి మహాలక్ష్మి దానయ్య, బండారు నాగరాజు, జిల్లా పంచాయతీరాజ్ విభాగం ప్రధాన కార్యదర్శి అడపా శ్రీనివాసరావు, నారాయణపురం ఉపసర్పంచ్ మరడ సాంబశివరావు, చేబ్రోలు ఎంపీటీసీ సభ్యులు రాయి లక్ష్మీ, మనసాల నాగమణి, పాపారావు బాబ్జి, కరణం బుజ్జి, బాబావలి తదితరులు పాల్గొన్నారు.

అలాగే ఉంగుటూరులో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, దొంతంశెట్టి సత్యనారాయణ, పెనుగొండ బాలకృష్ణతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొని పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు.


## డాక్టర్ జి వైశాలి,, డాక్టర్ రామలక్ష్మి లను సత్కరించిన గోకవరం ప్రాణ స్నేహితులు అసోసియేషన్.





**గోకవరం పెన్ పవర్ మార్చి 12:--** కనిపించని దేవుడు ఆ పరమాత్ముడు అయితే కనిపించి పునర్జన్మ నిచ్చే దేవుడు డాక్టర్ అని తూర్పుగోదావరి జిల్లా ఫైర్ మెన్ జిల్లా అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గంద్రెడ్డి మోహన్ అన్నారు.గోకవరం ప్రాణ స్నేహితులు గ్రూప్ మెంట్స్ అసోసియేషన్ తరుపున గురువారం గోకవరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపర్డెంట్ డాక్టర్ రామలక్ష్మి ని, గోకవరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ( ప్రభుత్వ ఆసుపత్రి ) లో నూతనంగా విధుల్లో జాయిన్ అయిన తూర్పుగోదావరి జిల్లా ఫైర్ మెన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గంద్రెడ్డి మోహన్ మేనకోడలు డాక్టర్ జి వైశాలిఎం బి బి ఎస్ ని గోకవరం ప్రభుత్వ ఆసుపత్రిలో మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా హాస్పటల్ సూపర్డెంట్ డాక్టర్ రామలక్ష్మి కి డాక్టర్ వైశాలి సాలువాకప్పి సత్కరించారు, అనంతరం డాక్టర్ వైశాలి కి ప్రాణ స్నేహితులు అసోసియేషన్ తరపున తూర్పుగోదావరి జిల్లా ఫైర్ మెన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గంద్రెడ్డి మోహన్ సాలువా కప్పి ఘనంగా సత్కరించారు అనంతరం ప్రాణ స్నేహితుల అసోసియేషన్ తరఫునుంచి డాక్టర్ వైశాలికి డాక్టర్ రామలక్ష్మి కి పుష్పగుచ్చిన అందించి శుభాకాంక్షలు తెలుపుతూ భవిష్యత్తులో అనేకమంది పేదలకు చక్కని ఓర్పు సహనంతో కలిగిన వైద్యాన్ని అందిస్తూ పేద ప్రజల దీవెనలు పొందాలని డాక్టర్ వైశాలి తన జీవితంలో ఉన్నతమైన స్థానానికి చేరు కోవాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. అభినందనలు తెలిపిన వారిలో కందుల సత్య నారాయణ, కరాసు శివరామకృష్ణ, పల్లెల బాబి, మామిడి వీరభద్రరావు, దొండపాటి చంద్రశేఖర్, నక్కా రామరాజు, విశ్వం శెట్టి లక్ష్మణ్ శివకుమార్, బోటు శ్రీనివాస్, బత్తిన రామకృష్ణ, వై వి ఎస్ నారాయణ, కంచర్ల ముద్దుల శ్రీను పలువురు పాల్గొన్నారు.

# యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే లక్ష్యాలు పూర్తి చేయాలి







**పిడతమామిడి, కొత్తాడ గ్రామాలను సందర్శించిన డిప్యూటీ ఎంపీడీవో గోపన్న దొర**

**గంగవరం, పెన్ పవర్, మార్చి 12:**గంగవరం మండలంలోని పిడితమామిడి, కొత్తాడ గ్రామాలను మండల స్వర్ణ అధికారి, గంగవరం డిప్యూటీ ఎంపీడీవో గోపన్న దొర గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే పనులను సమీక్షిస్తూ ప్రభుత్వం నిర్దేశించిన ఈరోజు లక్ష్యాన్ని తప్పనిసరిగా పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందిని ఆయన కోరారు.పిడతమామిడి గ్రామంలోని ఎంపీపీ పాఠశాలను సందర్శించిన ఆయన పాఠశాల స్టాక్‌ను పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు పౌష్టికాహారం సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. కొత్తాడ గ్రామాన్ని సందర్శించిన గోపన్న దొర గ్రామంలో తాగునీటి సమస్యలు లేకుండా ఉండేలా లీకేజీలను వెంటనే మరమ్మతు చేయాలని పీడీవోను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో పిడితమామిడి హెచ్‌ఎం గురవయ్య, కొత్తాడ పీడీవో కె. అంజిరెడ్డి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# పూళ్లలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 16వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు





**పెన్ పవర్, భీమడోలు, మార్చి 12:**భీమడోలు మండలం పూళ్ల గ్రామంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 16వ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం డిసిసిబి మాజీ డైరెక్టర్, పూళ్ల సొసైటీ మాజీ అధ్యక్షులు కందులపాటి శ్రీనివాసరావు పర్యవేక్షణలో జరిగింది. పూళ్ల గ్రామ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కందులపాటి మురళీధర్ రావు ఆధ్వర్యంలో వినాయకుడి గుడి సెంటర్‌లో పార్టీ జెండాను ఆవిష్కరించారు.

అనంతరం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు పార్టీ స్థాపన దినోత్సవాన్ని పురస్కరించుకుని వైఎస్ఆర్ సేవలను స్మరించుకున్నారు.

ఈ కార్యక్రమంలో బీసీ సెల్ అధ్యక్షులు గొందు కృష్ణ చైతన్య, ఎస్సీ సెల్ అధ్యక్షులు నూకల రాజు, యూత్ అధ్యక్షులు అల్లు మను, మహిళా అధ్యక్షురాలు కొరపాటి వెంకటలక్ష్మి, సనపల గాంధీ, సీనియర్ నాయకులు కేతినీడి విశ్వేశ్వరరావు, పచ్చ లక్ష్మీనారాయణ, పులఖండం మధుసూదన రావు, రాయబారపు రంగబాబు, యాసా వెంకట్రామయ్య, దాసం నాగభూషణం, పోలిశెట్టి నరేష్, తాటిపాక అంజి, బూరగ రాజు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పెద్దేవంలో వైఎస్సార్సీపీ ఆవిర్భావ దినోత్సవం




**తాళ్ళపూడి, పెన్ పవర్, మార్చి 12:**మండలంలోని పెద్దేవం గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 16వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తోట రామకృష్ణ పాల్గొని దివంత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పెద్దేవం గ్రామ సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు, బట్టు సుబ్బారావు, నల్లాకుల వేణు గోపాలకృష్ణ, కోడి రామకృష్ణ, చామకూరి సత్యనారాయణ, యండపల్లి కృష్ణార్జునులు, వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## జ్ఞాన సరస్వతి స్కూలు నందు ఘనంగా సరస్వతి హోమః

- టెన్త్ విద్యార్థులకు విజయం చేకూరాలనే సరస్వతి పూజా...





**గోకవరం పెన్ పవర్ మార్చి 12 :--** గోకవరం మండలం లో ప్రముఖ విద్యాసంస్థ అయిన జ్ఞాన సరస్వతి విద్యానికేతన్ స్కూల్ నందు ఘనంగా సరస్వతి దేవి హోమం నిర్వహించారు. స్కూలు చైర్మన్ కంచర్ల సూర్య ప్రకాష్, స్కూల్ పౌండర్ డైరెక్టర్ బొడ్డేటి సురేష్ దంపతుల ఆధ్వర్యంలో స్కూల్ ఆవరణలో వేద పండితులు సరస్వతి పూజ , హోమం నిర్వహించారు. ఈసందర్భంగా స్కూలు చైర్మన్ కంచర్ల సూర్య ప్రకాష్ , స్కూలు పౌండర్,డైరెక్టర్ బొడ్డెటి సురేష్ మాట్లాడుతూ 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు అందరూ పబ్లిక్ పరీక్షలలో ఘనవిజయం సాధించాలని ఆ సరస్వతి దేవి అనుగ్రహం కలగాలని జ్ఞాన సరస్వతి విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు సరస్వతి హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించమన్నారు.

## ఈ నెల 17న తొలి తెలుగు దళిత కవి కుసుమ ధర్మన్న 126వ జయంతి ఉత్సవాలు

- ఇద్దరు కవులకు జాతీయ పురస్కార పురస్కారాలు
- గోదావరి గట్టున కుసుమ ధర్మన్న కాంస్య విగ్రహాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయాలి



**రాజమహేంద్రవరం, పెన్ పవర్,, మార్చి 12:** ఆనాటి సమాజం లో సనాతన ధర్మం, చాందస వాదం నెలకొన్న రోజుల్లో రాష్ట్రంలోనే తొలి తెలుగు దళిత కవిగా, అభ్యుదయ రచయిత గా ఆనాటి దళిత సమాజాన్ని జాగృతం చేసిన మహనీయుడు కుసుమ ధర్మన్న నేటి తరం, ముఖ్యంగా దళిత యువత స్ఫూర్తిగా తీసుకోవాల్సిన మాజీ ఎంపీ జీ వీ హర్ష కుమార్ అన్నారు. ఈ నెల 17న తొలి తెలుగు దళిత కవి కుసుమ ధర్మన్న 126వ జయంతి ఉత్సవాలు స్థానిక కొంతమూరు గామన్ బ్రిడ్జి ఉన్న ప్రకృతి వేదిక లో నిర్వహిస్తున్నారు . ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ డిగ్రీ కళాశాలలో కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం మీడియా సమావేశంలో హర్ష కుమార్ మాట్లాడుతూ, స్వతంత్రానికి పూర్వం,స్వతంత్రం అనంతరం కూడా సమ సమాజానికి పాటు పడిన ఎందరో బడుగు ,బలహీన వర్గాల మహా నాయకులు చారిత్రాత్మక తప్పిదాల వల్ల మనుస్మృతి నాయకుల వల్ల మరుగున పడిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వారిలో రాజమండ్రి కి చెందిన తొలి తెలుగు దళిత కవి, ఆయుర్వేద వైద్యుడు కుసుమ ధర్మన్న ఒకరని అన్నారు. ఆనాటి సనాతన ధర్మం కొనసాగుతున్న సమాజంలో దళితుల హక్కుల కోసం, దేవాలయ ప్రవేశాల కోసం కుసుమ ధర్మన్న చేసిన పోరాటం స్ఫూర్తివంతమన్నారు. గోదావరి జిల్లాకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను ధర్మన్న రాజమండ్రి తీసుకొచ్చి దళితులను చైతన్యవంతం చేశారన్నారు. మహాత్మా గాంధీ సీతానగరం వచ్చినప్పుడు కూడా ఆయన చేత కుసుమ ధర్మన్న ప్రశంసలు పొందారన్నారు. మాకొద్దీ నల్ల దొరతనం , ఇంకా ఎన్నో సామాజిక చైతన్యవంతమైన రచనలు చేశారన్నారు. గోదావరి గట్టున కుసుమ ధర్మన్న కాంస్య విగ్రహాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. జయంతి ఉత్సవాల సందర్భంగా 17న జరిగే 126వ జయంతి కుసుమ ధర్మన్న జాతీయ విశిష్ట పురస్కారాలను డాక్టర్ బండి సత్యనారాయణ, జి జయరాజు లకు అందజేస్తున్నారు. ఈ కార్యక్రమానికి దళితులందరూ పెద్ద ఎత్తున హాజరుకావాలని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో కుసుమ ధర్మన్న మనవరాలు రాజకుమారి, డాక్టర్ తట పట్ల సత్యనారాయణ, అజ్జు రపు వాసు, ఆరే రాము, జక్కం సుబ్బారావు, విజ్జన మధు , అప్పారావు, ఎల్వీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**గోకవరం పెన్ పవర్ మార్చి 12:--** గోకవరం మండలం సూదికొండ గ్రామంలో క్యూఆర్ కోడ్ కలిగిన నూతన పట్టాదార్ పాస్ పుస్తకాలను జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమానికి రైతులు, భూమి యజమానులు, స్థానిక ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ రైతు భూమి అంటే రైతుకే సంపూర్ణ హక్కు ఉండాలని కూటమి ప్రభుత్వం స్పష్టమైన విధానంతో ముందుకు సాగుతోందన్నారు. గత ప్రభుత్వ పాలనలో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరుతో రైతుల భూములపై అనేక సందేహాలు, వివాదాలు సృష్టించే పరిస్థితి ఏర్పడిందని తీవ్రంగా విమర్శించారు. రైతుల ఆస్తులపై ప్రభుత్వ నియంత్రణ పెంచే విధంగా ఆచట్టాన్ని అమలు చేయాలని ప్రయత్నించారని, దీనివల్ల రైతుల్లో భయం మరియు అనిశ్చితి నెలకొన్నదన్నారు. ఈ విషయాలను గమనించి కూటమి ప్రభుత్వం రైతుల హక్కులను కాపాడే విధంగా “మీ భూమి మీకే హక్కు” అనే స్పష్టమైన ధోరణితో ముందుకు సాగుతోందని జ్యోతుల నెహ్రూ తెలిపారు. రైతుల భూములపై ఎలాంటి సందేహాలు లేకుండా ఉండేందుకు ప్రభుత్వ రాజముద్రతో పాటు ఆధునిక సాంకేతికత కలిగిన క్యూఆర్ కోడ్‌తో కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలను అందజేస్తున్నామని చెప్పారు. ఈ పాస్ పుస్తకాల ద్వారా భూమి యాజమాన్యానికి సంబంధించిన వివరాలు పూర్తిగా స్పష్టంగా నమోదు అవుతాయని, భవిష్యత్తులో ఎలాంటి వివాదాలకు తావు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. భూమి యాజమాన్యానికి సంబంధించిన పత్రాలు ప్రభుత్వ అధికారిక రాజముద్రతో ఉండాలి అని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా అమలు అవుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతుల సమస్యల పరిష్కారం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, రైతులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బాలికల ఆరోగ్య భవిష్యత్తు కోసం హెచ్ పి వి వాక్సినేషన్ దూరదృష్టి నిర్ణయం




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 12:**ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బాలికల ఆరోగ్య భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రారంభించిన హ్యూమన్ పప్పిలోమా వైరస్ వాక్సినేషన్ కార్యక్రమం దూరదృష్టి నిర్ణయమని ఎమ్మెల్సీ సోము వీర్రాజు

అన్నారు. ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్ లో నిర్వహించిన హెచ్ పి వి వ్యాక్సినేషన్ కార్యక్రమంలో బిజెపి ఎమ్మెల్సీ సోము వీర్రాజు , రాష్ట్ర సెక్రటరీ బొమ్మల దత్తు పాల్గొని బాలికలకు టీకాలు ఇచ్చారు. భవిష్యత్తులో మహిళలను సర్వికల్ క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల నుండి రక్షించడానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు .బాలికల ఆరోగ్య రక్షణకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు దేశానికి ఆరోగ్యవంతమైన భవిష్యత్తును అందిస్తాయిని వీర్రాజు అన్నారు. నందివాడ సత్యనారాయణ, వీర వీరంజనేయులు, కూటమి నాయకులు నందివాడ దినేష్, బుడ్డిగ గోపాలకృష్ణ మూర్తి, మర్రి దుర్గ శ్రీనివాస్, , యళ్ల మూర్తి, మద్దుకురి బుజ్జి, యేడిద వెంకటేష్, కాలేపు సత్య సాయిరామ్ , బండి ప్రసాద్, కృష్ణమాచారి, సత్య, చిన్నారావు, భువన్ , తంగేల్ల శ్రీనివాస్,తలాటం యూపీహెచ్సీ హేమలత, డాక్టర్ పి ఆమని ,హెచ్ పి వై అరుణమ్మ, ఏ అన్నం ఏఎన్ఎం ,స్వరూప రాణి, లక్ష్మి వీరభవాని, ఆశా వర్కర్స్ దేవి జ్యోతి ,దేవిక వెంకటలక్ష్మి నరసమ్మ ,నాగలక్ష్మి సత్య, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి జిల్లాల ప్రజలకు అందుబాటులో అడ్వాన్స్ డ్ గ్యాస్ట్రో వైద్య సేవలు

**యశోద హాస్పిటల్ డాక్టర్ కోన లక్ష్మి కుమారి**




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 12 :** గోదావరి ప్రాంత ప్రజలకు అధునాతన గ్యాస్ట్రోఇంటెస్టినల్ (జీఐ) వైద్య సేవలను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో యశోద హాస్పిటల్స్ ప్రత్యేక సంప్రదింపుల కార్యక్రమాన్ని రాజమహేంద్రవరంలో నిర్వహిస్తున్నట్లు సోమాజిగూడ యశోద హాస్పిటల్స్ కన్సల్టెంట్ సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్, మినిమల్ యాక్సెస్, రోబోటిక్ జీఐ సర్జన్, మెటబాలిక్ బారియాట్రిక్ సర్జన్ డాక్టర్ కోన లక్ష్మి కుమారి తెలిపారు. స్థానిక హోటల్ మంజీరలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. వైద్య నిపుణుల సలహాలు, శస్త్రచికిత్స అనంతర సేవలు కోసం తరచుగా హైదరాబాద్ కు వెళ్లాల్సిన రోగులకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను స్థానికంగా అందించడమే ఉద్దేశమని తెలిపారు. సంక్లిష్ట గ్యాస్ట్రో సమస్యలకు రోబోటిక్, మినిమల్లీ ఇన్వేసివ్ సర్జరీలతో సహా ఆధునిక చికిత్సా విధానాలపై నిపుణుల మార్గదర్శకత్వం అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా రోబోటిక్ , మినిమల్ యాక్సెస్ జీఐ సర్జరీలు, ఊబకాయం, టైప్2 డయాబెటిస్ నియంత్రణ, బారియాట్రిక్ మెటబాలిక్ సర్జరీలు, హెర్నియా అబ్డామినల్ వాల్ రిపేర్, కొలొరెక్టల్ సర్జరీలు, గాల్ బ్లాడర్, ప్యాంక్రియాస్, అప్పర్ జీఐ సంబంధిత శస్త్రచికిత్సలపై నిపుణుల సలహాలు అందించనున్నట్లు తెలిపారు. హెర్నియా, పిత్తాశయ సమస్యలు, రిఫ్లక్స్ వ్యాధి, అకలేసియా కార్డియా, కొలొరెక్టల్ , ప్యాంక్రియాటిక్ వ్యాధులతో బాధపడే రోగులు ఈ సేవలను వినియోగిం చుకోవచ్చునన్నారు. అడ్వాన్స్ లాపరోస్కోపిక్ పద్ధతులు, రోబోటిక్ సర్జరీలు, స్లీవ్ గ్యాస్ట్రెక్టమీ, గ్యాస్ట్రిక్ బైపాస్ వంటి బారియాట్రిక్ చికిత్సలు, డయాబెటిస్ నియంత్రణకు మెటబాలిక్ సర్జరీలు, సంక్లిష్ట అబ్డామినల్ వాల్ రీకన్స్ట్రక్షన్ వంటి సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. మినిమల్లీ ఇన్వేసివ్ రోబోటిక్ సర్జరీల ద్వారా చిన్న కోతలతోనే చికిత్స చేయడం వల్ల రోగులు త్వరగా కోలుకోవడంతో పాటు మెరుగైన ఫలితాలు పొందగలుగుతారన్నారు.

గోదావరి ప్రాంతం లో ఆహారపు అలవాట్లు శారీరక శ్రమ లేకపోవడం ఊబకాయం ,మధుమేహానికి కారణమన్నారు. వైద్య చికిత్సలు చేయించడంలో పేద ,ధనిక బేధం లేదని, అవసరాన్ని, లభ్యతను బట్టి మందులు వినియోగం ఉంటుందన్నారు ఈ మీడియా సమావేశంలో ఏపీ మార్కెటింగ్ మేనేజర్ నల్లం బాల వీరభద్ర, అసిస్టెంట్ మేనేజర్ ఎం.డి. షరీఫ్, ఎగ్జిక్యూటివ్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

# నేడే అన్నదాత సుఖీభవ( మూడవ విడత) పీఎం కిసాన్ (22 వ విడత) రిలీజ్

**మండల వ్యవసాయశాఖధికారిణి రాజ రాజేశ్వరి.**



**గోకవరం పెన్ పవర్ మార్చి 12:--**రైతులకు నేడు అనగా శుక్రవారం అన్నదాత సుఖీభవ ( మూడవ విడత) పీఎం కిసాన్ (22 వ విడత) మన ప్రధాన మంత్రి ప్రారంభిస్తున్నారని దీనిలో భాగంగానే మన జగ్గంపేట నియోజక వర్గంలో శాసన సభ్యులు నియోజక వర్గంలో కిర్లంపూడి మండలం ఎంపిడిఓ కార్యాలయంనుండి ప్రారంభిస్తున్నారని గోకవరం మండలం వ్యవసాయశాఖధికారిణి రాజ రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈరాష్ట్ర ప్రభుత్వం ద్వారా 7705 మంది రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.3.08 కోట్ల రూపాయలు,కేంద్ర ప్రభుత్వం ద్వారా పీఎం కిసాన్ పథకం ద్వారా 5485 రైతులకు రూ.1.1 కోట్ల రూపాయలు మొత్తం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం కలిపి రూ. 4.18 కోట్ల రూపాయలు రైతుల అకౌంట్ లోకి జమ చేయనున్నారని ఎ ఓ రాజరాజేశ్వరి తెలిపారు. రైతులకు అందరూ సదరు కార్యక్రమం కు హాజరు కావాలని గోకవరం మండల వ్యవసాయ అధికారిణి రాజరాజేశ్వరి కోరారు.

# బొమ్మిడి హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్లు,పెన్నులు పంపిణీ .





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. మార్చి 12.**బొమ్మిడి హై స్కూల్లో మాజీ ఎంపిపి మారిశెట్టి ప్రసాద్ 10వ తరగతి విద్యార్థులను ఉద్దేశించి ఆశీర్వవ చనాలు తెలియజేస్తూ విద్యార్థులకు పెన్నులు ,ప్యాడ్లు స్వీట్స్ బహూకరించిరి . పదో తరగతిలో విద్యార్థులందరూ పాస్ కావాలని మంచి భవిష్యత్తు భగవంతుడు మీకుఅందించాలని, అందరూ కూడా ఇష్టంతో చదవాలని సూచించారు.అదేవిధంగా ఈ సంవత్సరం 10వ తరగతి బోధించిన ఉపాధ్యాయులను శాలువలతో సత్కరించిరి. విద్యార్థులకు మంచి భోజనాలను వండి వడ్డెన చేసిన వంట వాళ్లకు చీరలను బహూకరించారు

**పౌష్టికాహారం అందించిన దాతలకు కృతజ్ఞతలు.**

ఉంగుటూరు మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బొమ్మిడి లో ప్రతి సంవత్సరం 10వ తరగతి పరీక్షలకు సిద్ధపడుతున్న విద్యార్థులకు మరియు చదువులో వెనకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు సాయంత్రశీ 7.30 గంటల వరకు నిర్వహించుచున్నారు. విద్యార్థులకు గ్రామస్తులు మరియు ఉపాధ్యాయులు కలిసి ప్రతిరోజు స్నాక్స్ ఏర్పాటు చేస్తున్నారు. స్నాక్స్ ఏర్పాటు చేయుటలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ బయ్యే సత్యనారాయణ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని తనకు తెలిసిన మిత్ర బృందంతో ప్రతిరోజు సాయంత్రం ఫ్రూట్స్ ,స్నాక్స్ ఏర్పాటు చేయడం అభినందనకరశీ. పాఠశాల అభివృద్ధికి , విద్యార్థుల భౌతిక అవసరాల తీరుస్తున్న సర్పంచ్ మద్దాల రాధాకుమారి, మారిశెట్టి ప్రసాద్ మరియు దాతలు అందరికీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. శ్రీదేవి గారు మరియు పాఠశాల సిబ్బంది కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

## ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా అడ్డతీగల ఆసుపత్రిలో అవగాహన కార్యక్రమం...



**అడ్డతీగల , పెన్ పవర్, మార్చ్12:** మండల కేంద్రమైన అడ్డతీగల ఆసుపత్రిలో మార్చ్ 12ప్రపంచకిడ్నీదినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమంనిర్వహించారు .ఈకార్యక్రమం డాక్టర్ పి. మహేష్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. అవగాహన కార్యక్రమం అనంతరం ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమం లో డాక్టర్ మహేష్ రెడ్డి మాట్లాడుతు ప్రతి ఒక్కరు మీ కిడ్నీల ఆరోగ్యం మీ చేతుల్లోనే ఉంటుంది అని,అలాగే
ప్రతిరోజూ తగినంత నీరు త్రాగడం,
ఉప్పు వాడకాన్ని తగ్గించడం,
క్రమం తప్పకుండా వ్యాయామం చేయండం వంటివి చేస్తే,
ఆరోగ్యకరమైన కిడ్నీలు, ఆరోగ్యకరమైన జీవితం మీ చేతుల్లోనే ఉంటుంది అన్నారు. అలాగే హాస్పిటల్ కౌన్సిలర్ నారే. వాసు మాట్లాడుతు ఆరోగ్యకరమైన ఆహారం: పండ్లు, ఆకుకూరలు మరియు తృణధాన్యాలు ఎక్కువగా తీసుకోవాలి అని,క్రమం తప్పకుండా వ్యాయామం, శారీరక శ్రమ కిడ్నీల పనితీరుకు మేలు చేస్తుంది అని అన్నారు. అలాగే డాక్టర్ అనూష, శ్రీహర్ష మాట్లాడుతు బీపీ మరియు షుగర్ నియంత్రణ,డయాబెటిస్ మరియు రక్తపోటు ఉన్నవారు వాటినిఅదుపులోఉంచుకోవాలి, పెయిన్ కిల్లర్స్ వాడ కూడదు అని డాక్టర్ సలహా లేకుండా తరచుగా నొప్పి నివారణ మందులు వాడకూడదు అని వాసు అన్నారు . ఎటువంటి ఆరోగ్య సమస్యలు ఉన్న వెంటనే హాస్పిటల్ కీ వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలి అని అన్నారు. ఈ కార్యక్రమం లో డాక్టర్ ప్రసన్న దేవి, రేష్మ బేగం, స్టాఫ్ ఊహ, దేవుడు, వెంకటలక్ష్మి, సునీత, సీత, శాంతి, విజయ ఇతర హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

## తాడేపల్లిగూడెం వద్ద రోడ్డు ప్రమాదం





- జార్ఖండ్ కు చెందిన 16 మందికి గాయాలు
- ఏరియా ఆసుపత్రిలో వైద్య సేవలు,భోజన సదుపాయం

**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. మార్చి 12:**పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం వద్ద ఏపీ ఎన్ఐటీకి సమీపంలో 16వ నెంబర్ జాతీయ రహదారిపై గురువారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాద ంలో జార్ఖండ్ నుంచి తిరుమలకు వెళుతున్న బస్సు అదుపు తప్పింది. ఈ బస్సులో ప్రయాణిస్తున్న ఝూర్ఖండ్ కు చెందిన 16 మంది గాయపడ్డారు. వీరంతా తిరుమల దర్శనానికి వెళుతున్నారు. గాయపడిన వారికి తాడేపల్లిగూడెం ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేసే వైద్య సేవలు అందించారు. కొంతమందికి ఎముకలు ఫ్రాక్చర్ కావడంతో వారికి శస్త్ర చికిత్సలు నిర్వహించారు. వీరంతా జార్ఖండ్ నుంచి వస్తుండడంతో ఆసుపత్రిలో వైద్య సేవలు అందించడంతో పాటు, భోజన సదుపాయం ఏర్పాటు చేసినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జె.విజయలక్ష్మి తెలియజేశారు. ఆసుపత్రి వైద్యులు డాక్టర్ రషీద్, డాక్టర్ పి.నవీన్, డాక్టర్ ఆనంద స్వరూప్, డాక్టర్ విద్య లు వైద్య సేవలు అందించారు. స్వల్ప గాయాలైన వారికి వైద్యం చేసి పంపించివేస్తామని, ఫ్రాక్చరైన వారు మాత్రం ఒకటి, రెండు రోజులు ఆసుపత్రిలో ఉండవలసి వస్తుందని తెలియజేశారు.

## తాడేపల్లిగూడెంలో జనసేనకు షాక్

**వడ్డి రఘురామ్ నాయుడు ఆధ్వర్యంలో జనసేన నుండి వైకాపా లో చేరిన సుమారు 200మంది మహిళా కార్యకర్తలు**



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. మార్చి 12.**పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో నియోజకవర్గ ఇంచార్జి వడ్డి రఘురామ్ నాయుడు ఆధ్వర్యంలో సుమారు 200 మంది మహిళలు జనసేన పార్టీ నుండి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. తాడేపల్లిగూడెం పట్టణంలోని 24, 25 వ వార్డులకు చెందిన సుమారు 200మంది కొంతకాలం క్రితం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుండి జనసేన పార్టీలోకి వెళ్లారు. మళ్లీ ఈరోజు తిరిగి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి సొంతగూటికి తిరిగి వచ్చారు. పార్టీలోకి వచ్చిన మహిళలకు వడ్డి రఘురామ్ నాయుడు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వడ్డి రఘురామ్ మాట్లాడుతూ అందరూ ఒక్కటిగా పార్టీ కోసం కృషి చేయాలని, క్షేత్ర స్థాయి నుండి పార్టీని బలోపేతం చేయాలని కోరారు. మహిళా సాధికారత, అభ్యున్నతికి కృషి చేసిన ఒకే ఒక్క పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అన్నారు. ఎల్లప్పుడూ ప్రతీ కార్యకర్తకు పార్టీలో సముచిత స్థానం ఉంటుందన్నారు. ప్రతి కార్యకర్తకు అన్ని వేళల, అన్ని విధాలుగా అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. మరలా వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసేందుకు ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని, తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో వైసీపీ జెండా ఎగురవేయలన్నారు.
ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రక్ష భారత్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఉచిత కరాటే శిక్షణ తరగతులు





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. మార్చి 12.**చాగల్లు మండలంలోని మార్కొండపాడు గ్రామానికి చెందిన రక్ష భారత్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఉచిత కరాటే శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. కరాటే మాస్టర్ భాషా డోన్బాక్ బెల్ట్ ఎస్క్ మాట్లాడుతూ కరాటే నేర్చుకోవటం ద్వారా పిల్లలలో మనసిక దైర్యం, ఏకాగ్రత, శారీరక దృడత్వం లను పెంపోందించుకోవచ్చుని అని ప్రపంగించారు. ఆర్ బి ఎస్ ఎస్ ఓ ప్రెసిడెంట్ అల్లాడి బాలాజీ మాట్లాడుతూ కరాటే వలన ఆత్మరక్షణ మరియు ఆత్మ విశ్వాసం తో పాటు ఆడ పిల్లల భద్రతకు దోహద పడుతుంది అని చెప్పారు.
ఈ శిక్షణ తరగతులను 40 మంది పిల్లలు వినియోగించుకుని విజయవంతం చేసినందుకు గాను ఆర్ బి ఎస్ ఎస్ ఓ ఉచిత యోగా తరగతులు మా గ్రామస్తులకు అందిచాలన్న యోచన లో ఉంది అన్నారు.ఈ కరాటే శిక్షణ తరగతులను ప్రభుత్వం ప్రతి పాఠశాలలో తప్పనిసరి చేసి తద్వారా పిల్లలలో మానసిక ఉత్సాహం మెరుగుపరిచే దిశగా చర్యలు తీసుకోవాలని ఆర్జిస్తున్నట్టు గా అల్లాడి బాలాజీ చూచించారు

## జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవానికి జన సైనికులు తరలిరండి..



**అడ్డతీగల , పెన్ పవర్, మార్చి 12:** రంపచోడవరం నియోజవర్గం అడ్డతీగల మండలం జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవానికి మండల నలుమూలల నుండి నాయకులు కార్యకర్తలు, తరలిరావాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రోగ్రాం కమిటీ మెంబర్ తాటికొండ. రాజేంద్ర కోరారు. జనసేన పార్టీఅధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రఉపముఖ్యమంత్రి కొణిదల.పవన్ కళ్యాణ్ గ ఆదేశాల మేరకు, అడ్డతీగలలో శనివారం జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా, నియోజకవర్గ నాయకులు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రోగ్రాం కమిటీ మెంబర్ తాటికొండ. రాజేంద్ర ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సెంటర్ లో జనసేనపార్టీ స్థూపం వద్ద జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది అని తాటికొండ.రాజేంద్ర తెలిపారు.ఈ కార్యక్రమానికి అడ్డతీగల మండల జనసేన నాయకులు, వీర మహిళలు, జనసేన కార్యకర్తలు, జన సైనికులు అందరూ పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా తాటికొండ. నాగేంద్ర కోరారు.

## కూరగాయల రంగంలో ఆధునిక జన్యు సాంకేతికత ప్రాముఖ్యత




**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. మార్చి 12.**డావవై.యస్.ఆర్.ఉద్యాన విశ్వవిద్యాలయం గురువారం నాడు విశ్వవిద్యాలయ గౌరవ ఉపకులపతి డావకె. ధనుంజయ రావు గారి అధ్యక్షతన, డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రియల్ & ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్స్ డావసి.హెచ్.రూత్ పర్యవేక్షణ లో 'దిగుబడి, నాణ్యత మరియు తెగుళ్ల నిరోధకత కోసం కూరగాయల పంటలలో ఆధునిక పద్ధతులు' అనే అంశంపై హైబ్రిడ్ మోడ్‌లో వెబినార్ నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త, మాజీ విస్తరణ సంచాలకులు డావఆలపాటి సత్యనారాయణ గారు తన ప్రసంగంలో కూరగాయల రంగంలో ఆధునిక జన్యు సాంకేతికత ప్రాముఖ్యతను వివరించారు. 100కు పైగా పంట వంగడాలను అభివృద్ధి చేసిన అనుభవంతో, ఆయన హైబ్రిడైజేషన్ మరియు గ్రాఫ్టింగ్ పద్ధతుల గురించి వివరించారు. ముఖ్యంగా పోషకాహార లోపాన్ని నివారించేందుకు క్యారెట్, పాలకూర వంటి పంటలలో బయో-ఫోర్టిఫికేషన్ పద్ధతులను అవలంబించాలని ఆయన సూచించారు. ఉపకులపతి డావకె. ధనుంజయ రావు తన అధ్యక్ష ప్రసంగంలో భారతీయ ఉద్యానవన రంగం ఇప్పుడు 'హరిత విప్లవం' (పరిమాణం) నుండి 'జీన్ విప్లవం' (విలువ) వైపు మళ్లాలని పిలుపునిచ్చారు. వాతావరణ మార్పులను తట్టుకుంటూ, తక్కువ ఖర్చుతో కూరగాయల లభ్యతను పెంచడమే లక్ష్యంగా పరిశోధనలు జరగాలని కోరారు. దీనికోసం సి ఆర్ ఐ పి ఆర్ . కేస్9వంటి జన్యు సవరణ సాంకేతికతలను, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత డిజిటల్ సాధనాలను వినియోగించుకోవాలని ఆయన శాస్త్రవేత్తలకు సూచించారు.
ముగింపు కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ ఎం. మాధవి వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, వివిధ విభాగాల శాస్త్రవేత్తలు, విద్యార్థులు, నిపుణులు పాల్గొన్నారు.

## పొత్తులపై పోటీ చేసి తన సత్తా చాటి పైకి ఎగురుతున్న జెండా పుట్టి నేటికి 16 ఏళ్ళు.



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. మార్చి 12.**పోరాటాలు తప్ప పొత్తులు ఎరుగని జెండా.. పొత్తులపై పోటీ చేసి తన సత్తా చాటి పైకి ఎగురుతున్న జెండా పుట్టి నేటికి 16 ఏళ్ళు.. స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సెల్ మెంబెర్ కొట్టు వెంకట్ (నాగు ) ఆధ్వర్యంలో..
ఘనంగా 16 వ వైస్సార్సీపీ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు..
స్థానిక మసీద్ సెంటర్లో వైస్సార్సీపీ 16 వ ఆవిర్భావ దినోత్సవం సందర్బంగా 9,10,11,12 వార్డు కూడలి లో గల వైస్సార్ విగ్రహానికి పూలదండలు వేసి బిస్కట్స్ పంచి వేడుకలు ఘనంగా నిర్వహించిన వైస్సార్సీపీ నాయకులు..
కట్టా నాగరాజు, ఉదయభాస్కర్, బొద్దాని శ్రీను,పాలకోడేటి సురేష్, అరిగేల అభిషేక్,పెరుమాళ్ళ నాగరాజు,సుంకర శ్రీను, రమేశరెడ్డి, గోపి, ఆషిఫ్, సందీప్, శివ తదితరులు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

## జిల్లా లో పోలీస్ స్టేషన్లలో "పల్లెనిద్ర



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 12 :**తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు నేర నివారణాత్మక పోలీసింగ్ లో భాగంగా జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో "పల్లెనిద్ర(గ్రామ, వార్డు)
జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ముందస్తు చర్యలు.
పోలీసుప్రజల మధ్య నమ్మకం, సహకారం పెంపొందించుకోవడం ద్వారా మాత్రమే నేరరహిత సమాజం సాధ్యమవుతుంది.
తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు "పల్లెనిద్ర(గ్రామ, వార్డు)" చేసి ప్రజలతో మమేకమై సమస్యలను, అక్కడి పరిస్థితులను గురించి తెలుసుకొని, నేరాల నియంత్రణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన జిల్లా పోలీసు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.
ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ,వి జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రామీణ, వార్డు ప్రాంత ప్రజల భద్రత, అవగాహన, పోలీసుప్రజల మధ్య స్నేహపూర్వక సంబంధాలను బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని, గ్రామాలు, వార్డులలో ఏవైనా సమస్యలు ఉంటే పోలీస్ అధికారుల దృష్టికి తీసుకొని రావాలని, ఆ సమస్యల పరిష్కారానికి వేగవంతంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.
ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న నేరాలు , నూతన చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు.జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలకు పూనుకుంటున్నటు వంటి వారి పట్ల కఠినమైన చర్యలు తీసుకుంటున్నామని, దీనిలో భాగంగా డ్రోన్ కెమెరాలతో ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ఈ సందర్భంగా పోలీసు అధికారులు మహిళా భద్రతా విధానాలు, సెల్ఫ్ డిఫెండింగ్ టెక్నిక్స్, సైబర్ నేరాలు, లోన్ యాప్‌లు, ట్రాఫిక్ నియమాలు, సోషల్ మీడియా మోసాలు, యాంటీ డ్రగ్స్, బాల్య వివాహాలు మరియు శక్తి యాప్‌ల డౌన్‌లోడ్‌ల గురించి అవగాహన కలిగించారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల నేరాల నియంత్రణ, ఆధారాల సేకరణలో కలిగే ప్రయోజనాలను వివరించారు.
గత రాత్రి టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 18 వార్డ్, కొవ్వూరు టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గౌతమి నగర్, చాగల్లు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఊనగట్ల గ్రామం నందు పల్లెనిద్ర(గ్రామ, వార్డు) కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

## ఘనంగా వై.సి.పి.పార్టీ ఆవిర్భావ దినోత్సవం

* వై.యస్.ఆర్.కాంగ్రెస్,పార్టీమండలనాయకులు



**వి.ఆర్.పురం పెన్.పవర్.మార్చి.12:**మండలంలోని రేఖపల్లి,కీ:శే:మాజీముఖమంత్రి వై.ఎస్. రాజశేఖర్,రెడ్డి విగ్రహం వద్ద గురువారం వై.సి.పి.పార్టీ మండల నాయకులు ఆధ్వర్యంలో వై.యస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం నూతిగూడెం అంగన్వాడీ,కేంద్రంలో అయి దుగురు పిల్లలకు ఫుడ్ పాయిజన్,కావడంతో వారిని కూ నవరం మండలం కోతులగుట్ట ప్రభుత్వ వైద్యశాలకు తర లించిన సంగతి అందరికి తెలిసిన విషయమే వై.యస్. ఆర్.కాంగ్రెస్,పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వై. సి.పి.పార్టీ మండల నాయకులు ప్రభుత్వవైద్యశాలో ఫుడ్ పాయిజన్,కారణంగా చికిత్స పొందుతున్న పిల్లలను పరా మర్శించి,రొట్టెలు,పండ్లు,అందజేశారు.ప్రభుత్వవైద్యశాలో పనిచేయుచున్న డాక్టర్,ను పిల్లల ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలోవై.సి.పి.పార్టీ మండల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పండుగ వాతావరణంలో జరుపుకోవాలి

* జనసేన ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్

**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 12:** ఈ నెల 14వ తేదీన జరగనున్న జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జగ్గంపేట నియోజకవర్గంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో ప్రతి మండలంలో మరియు గ్రామాలలో ఉదయం 8 గంటలకు జనసేన పార్టీ జెండా ఆవిష్కరణ నిర్వహించి, టపాసులు కాల్చి స్వీట్లు పంచుతూ పండుగ వాతావరణంలో జరుపుకోవాలని జనసేన జగ్గంపేట నియోజకవర్గ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ అన్నారు. గురువారం ఆయన పత్రిక ప్రకటన విడుదల చేశారు. జెండా దిమ్మలు లేని గ్రామాలలో ముందుగానే జనసేన పార్టీ జెండా దిమ్మలు ఏర్పాటు చేసి ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించుకోవాలన్నారు.
ప్రతీ గ్రామంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం పూర్తయిన అనంతరం జనసైనికులు అందరూ మండల హెడ్ క్వార్టర్స్‌లో జరిగే జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో భారీ స్థాయిలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.
జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ శ్రీ తుమ్మలపల్లి రమేష్ నియోజకవర్గంలోని నాలుగు మండలాల హెడ్ క్వార్టర్స్‌లో జెండా ఆవిష్కరణ కార్యక్రమాలలో పాల్గొంటారు.
14వ తేదీ ఉదయం 9 గంటలకు కిర్లంపూడి మండలం హెడ్ క్వార్టర్స్, ఉదయం 10 గంటలకు జగ్గంపేట టౌన్, ఉదయం 11 గంటలకు గండేపల్లి మండలం హెడ్ క్వార్టర్స్, మధ్యాహ్నం 12 గంటలకు గోకవరం మండలం హెడ్ క్వార్టర్స్ లో జరిగే కార్యక్రమాల్లో రమేష్ పాల్గొంటారు. ఈ కార్యక్రమాలలో జనసైనికులు, నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## ఉద్యాన కళాశాల లో 12 వ ఇంటర్ కాలేజియేట్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ 2025-26





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. మార్చి 12:**డా. వై.ఎస్.ఆర్. ఉద్యాన విశ్వ విద్యాలయం,ఉద్యాన కళాశాల, వెంకటరామన్నగూడెం. 13-03-26 నుండి 15-03-26 వరకు వెంకటరామన్నగూడెం లో ఉన్న ఉద్యాన కళాశాల లో 12 వ ఇంటర్ కాలేజియేట్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ 2025-26 నిర్వహించబడుతుంది.దీనిలో భాగంగా వై ఎస్ ఆర్ ఉద్యాన విశ్వ విద్యాలయం పరిధిలో ఉన్న 5 ప్రభుత్వ,3 ప్రైవేట్ కళాశాలలు పాల్గొంటున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా డా వై ఎస్ ఆర్ ఉద్యాన విశ్వ విద్యాలయం ఉప కులపతి. డా.ధనుంజయ రావు , శ్రీ.రవి నాయుడు ఛైర్పర్సన్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ మరియు డా.మధుమతి , డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ ముఖ్య అతిధులతో పాటు ఇతర యూనివర్సిటీ ఆఫీసర్స్ పాల్గొంటున్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## గ్రామాల్లో మెరుగైన మౌలిక సదుపాయాలకు కృషి

ధవలేశ్వరం గ్రామంలో సమస్యలను తనిఖీ చేసిన ఎమ్మెల్యే గోరంట్ల



**రాజమహేంద్రవరం పెన్ పవర్, మార్చి 12 :**గ్రామాల్లో మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. బుధవారం ధవలేశ్వరం గ్రామంలో ఎర్ర కొండ ఏరియా, వీరభద్ర నగర్ కాలనీ, బరియల్ గ్రౌండ్ ప్రాంతాలలో ఉన్న రోడ్డు , డ్రైనేజీలను గోరంట్ల స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ ఎర్ర కొండ ఏరియాలో మెయిన్ డ్రైనేజీ నిర్మించేందుకు పనులు మొదలు పెడతామని, బరియల్ గ్రౌండ్ ని ఆనుకొని ఉన్న వీరభద్ర నగర్ కాలనీ ఏరియాలలో రోడ్లు డ్రైనేజీ నిర్మించేందుకు అంచనాలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ పందురి అప్పారావు, జి.ఎస్.ఆర్ ఫౌండేషన్ అధినేత గాలి సుబ్బరాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


## అభివృద్ధికి దాతల సహకారం ఎంతో అవసరం. ఎమ్మెల్యే మద్దిపాటి.






**గోపాలపురం, పెన్ పవర్, ఫిబ్రవరి 12.** అభివృద్ధికి దాతల సహాయ సహకారాలు ఎంతో అవసరమని గోపాలపురం శాసనసభ్యులు మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. నియోజకవర్గంలోని దేవరపల్లి గ్రామ శివారులో ఉన్న పరమేశ్వర బయోటెక్ సంస్థ లిమిటెడ్ ద్వారా అందించిన కోటి రూపాయలతో నూతనంగా నిర్మించనున్న ఆసుపత్రి భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే, అతిధులతో కలిసి గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నదన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం కోసం పీ4 కార్యక్రమంలో భాగంగా పరమేశ్వర బయోటెక్ ఆర్థిక సహాయంతో దేవరపల్లిలో ఆసుపత్రి కి సంబంధించిన భవనాన్ని నిర్మించడం ఆనందదాయకమన్నారు. ఈ నిర్మాణం వల్ల చుట్టుపక్కల ప్రాంతాల వారికి సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందుతాయి అన్నారు. రోగులుకు కావలసిన మరింత మెరుగైన వైద్య సేవలు అందించడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రులను అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తామని విషయాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టికి సైతం తీసుకువెళ్లినట్లు వెంకటరాజు పేర్కొన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపడమే తన ప్రధాన ధ్యేయం అన్నారు. ఈ ప్రాంత ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని దాతృత్వంతో ఆర్థిక సహాయాన్ని అందించిన పరమేశ్వర బయోటెక్ లిమిటెడ్ సంస్థ చైర్మన్ ఉపేంద్ర రెడ్డి, ఎండి ఆనంద స్వరూప్ లకు స్థానిక ప్రజానీకం తరుపున కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం దాతలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ దొడ్డిగర్ల సువర్ణ రాజు, సంబంధిత అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## వైఎస్ షర్మిళారెడ్డి యాత్రకు విశేష ప్రజా స్పందన




**-బాలేపల్లి మురళీధర్‌కు చిరు సత్కారం**

**రాజమహేంద్రవరం పెన్ పవర్, మార్చి 12 :**దేశానికి రాహుల్ గాంధీని ప్రధానిగా.. రాష్ట్రానికి వైఎస్ రాజశేఖర్ రెడ్డి తనయ షర్మిళమ్మను ముఖ్యమంత్రిగా చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పని చేయలని పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పరిరక్షించేందుకు చేపట్టిన ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర విజయవంతం కావడం పట్ల హార్షాతిరేకాలు వ్యక్తం చేసారు. స్థానిక మున్సిపల్ కాలనీలో కాంగ్రెస్ పార్టీ కార్యాయంలో గురువారం మీడియా సమావేశంలో అర్బన్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ మాట్లాడుతూ, తాను రాజమండ్రి అర్బన్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేయాలని ఉత్తర్వులు అందుకున్నట్టు తెలిపారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఈ శిక్షణా తరగతులకు హాజరై తమతో పాటు కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా మాట్లాడారని తెలిపారు. తూర్పు గోదావరి జిల్లాలోని గోపాలపురం, రాజానగరంలో జరిగిన షర్మిళారెడ్డి ఉపాధి హామీ పరిరక్షణ యాత్రను పిసిసి ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్, ఇన్‌చార్జ్ కాకర్ల హరిబాబు విజయవంతం చేసారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆమె చేపట్టిన యాత్రకు విశేష ప్రజా స్పందన వచ్చిందన్నారు. పిసిసి ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగడుతూ షర్మిళ యాత్ర సాగిందన్నారు. ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం ఆగదని ఆమె స్పష్టమైన సంకేతాలు ఇచ్చారన్నారు. రాజమండ్రి పార్లమెంట్ కో ఆర్డినేటర్ టీకే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకా గాంధీ పిలుపు మేరకు ఘర్ వాపస్ ఆవో కార్యక్రమాన్ని చేపడుతున్నామని, పార్టీలో క్రియాశీలకంగా పనిచేసి దూరంగా ఉన్న వారందర్నీ కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్నట్టు వివరించారు. చంద్రబాబు, జగన్ కాంగ్రెస్ పార్టీ నుంచి వెళ్లిన వారేనని, తిరిగి వచ్చిన వారందరికీ సముచిత గౌరవం కల్పిస్తామన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మోతా శారద, కాకర్ల హరిబాబు, డాక్టర్ రాజశేఖర్, బత్తిన చంద్రరావు, మేడవరపు భద్రం దొర, సింధియా రాణి, బర్రే సుబ్రహ్మణ్యం, తాడి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం రాజమండ్రి అర్బన్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన బాలేపల్లి మురళీధర్‌కు దుశ్శాలువాలతో చిరు సత్కారం చేసి అభినందనలు తెలిపారు.

## ఘనంగా వైఎస్సార్సీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



* అధిక సంఖ్యలో తరలి వచ్చిన పార్టీ శ్రేణులు
* పేదలకు నూతన వస్త్రాలు అందజేత

**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 12;**రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు మండల కేంద్రమైన ఆలమూరులో గురువారం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. మండల కన్వీనర్, చెముడులంక గ్రామ సర్పంచ్ తమ్మన శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈవేడుకలకు పార్టీ సీనియర్ నేతలు చల్లా ప్రభాకరరావు, యనమదల నాగేశ్వరరావు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జడ్పీటీసీ తోరాటి సీతా మహాలక్ష్మి, నెక్కంటి వెంకట్రాయుడు, నామాల శ్రీనివాస్, చల్లా వెంకట సుబ్రహ్మణ్యం, నల్లి రాజు, కొడమంచిలి హరీష్ కుమార్, సర్పంచ్ నేలపూడి లావణ్య, ఉప సర్పంచ్ చల్లా సీతా మహాలక్ష్మి, వైస్ ఎంపీపీ వాసంశెట్టి దుర్గాభవానీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాడి ఎన్నికలు హామీలు అమలు జరిగేలా చూడాలని పలువురు నేతలు పిలుపునిచ్చారు. అలాగే 2029లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్సీపీని అధికారంలోకి తీసుకురావాలని కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. అనంతరం కేక్ ను కట్ చేసి పార్టీ శ్రేణులు ఒకరికొకరు తినిపించుకుని తమ అభిమానాన్ని చాటుకున్నారు.
పేదలకు నూతన వస్త్రాలు పంపిణీ
జిల్లా కాపు సంఘం అధ్యక్షులు, పార్టీ నేత చల్లా ప్రభాకరరావు సమకూర్చిన నూతన వస్త్రాలను ఈసందర్భంగా పార్టీ శ్రేణులు పేదలకు అందజేశారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి అందరూ ర్యాలీగా వెళ్లి రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. మోటుపల్లి వెంకన్న, పాలంగి ఉమాదేవి, చల్లా నానాజీ, నాయుడు ప్రసాద్, పెంటపాటి వెంకట్రావు, తోరాటి గోవిందు, గుత్తుల శ్రీనివాస్, నాతి కుమార్ రాజా, చల్లా భూషణం, కోలా నాని, పిల్లి ధనరాజు, గుత్తుల జయరాజు, గోపు నాగు తదితరులు పాల్గొన్నారు.

# బ్యాటింగ్ లెజెండ్ ద్రవిడ్‌కు లైఫ్ టైమ్ అచీవ్ మెంట్ పురస్కారం!

**రాహుల్ ద్రవిడ్‌కు సీకే నాయుడు జీవిత సాఫల్య పురస్కారం**

**క్రికెటర్ ఆఫ్ ది ఇయర్‌గా శుభ్‌మన్ గిల్ ఎంపిక**

**టీ20 ప్రపంచకప్ విజేతలతో పాటు పలు జట్లకు సత్కారం**

**దేశవాళీ క్రికెట్‌లో ఉత్తమ సంఘంగా ముంబై క్రికెట్ అసోసియేషన్**

**మార్చి 15న ఢిల్లీలో బీసీసీఐ 'నమన్' అవార్డుల ప్రదానం**



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) వార్షిక అవార్డుల ప్రదానోత్సవానికి రంగం సిద్ధమైంది. ఈ నెల 15న దేశ రాజధాని ఢిల్లీలో 'నమన్' పేరుతో జరగనున్న ఈ కార్యక్రమంలో భారత బ్యాటింగ్ దిగ్గజం, మాజీ హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్‌కు ప్రతిష్ఠాత్మక కల్నల్ సీకే నాయుడు జీవిత సాఫల్య పురస్కారం లభించనుంది. అదేవిధంగా, భారత టెస్టు, వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌ను 'ఉత్తమ అంతర్జాతీయ క్రికెటర్' (పాలి ఉమ్రిగర్ అవార్డు) విభాగంలో ఎంపిక చేసినట్టు తెలుస్తోంది. భారత క్రికెట్‌కు చేసిన సేవలకు గుర్తింపుగా ద్రవిడ్‌ను లైఫ్ టైమ్ అచీవ్ మెంట్ పురస్కారానికి ఎంపిక చేశారు. ఆయన మార్గనిర్దేశంలోనే భారత్ 2024 టీ20 ప్రపంచకప్ గెలిచిన సంగతి తెలిసిందే. మరోవైపు, 2025లో టెస్టుల్లో 983 పరుగులు, వన్డేల్లో 490 పరుగులతో అద్భుత ప్రదర్శన కనబరిచిన శుభ్‌మన్ గిల్‌కు 'క్రికెటర్ ఆఫ్ ది ఇయర్' గౌరవం దక్కనుంది. టీ20 ప్రపంచకప్ జట్టులో గిల్ సభ్యుడు కానప్పటికీ, టెస్టులు, వన్డేల్లో నిలకడైన ప్రదర్శనతో ఈ అవార్డుకు ఎంపికయ్యాడు. ఈ వేడుకలో... ఇటీవల టీ20 ప్రపంచకప్ గెలిచిన భారత పురుషుల జట్టు, 2025 ఛాంపియన్స్ ట్రోఫీ, 2025 మహిళల వన్డే ప్రపంచకప్ గెలిచిన జట్లతో పాటు అండర్-19 ప్రపంచకప్ విజేతలను కూడా బీసీసీఐ సత్కరించనుంది. అయితే, ఇదే రోజున దేశవాళీ టోర్నీల ఫైనల్స్ ఉండటంతో కొంతమంది మహిళా క్రికెటర్లు ఈ కార్యక్రమానికి హాజరుకాలేకపోవచ్చని సమాచారం. దేశవాళీ క్రికెట్‌లో ఉత్తమ పనితీరు కనబరిచిన అసోసియేషన్ గా ముంబై క్రికెట్ అసోసియేషన్ వరుసగా మూడోసారి అవార్డు అందుకోనుంది. వీరితో పాటు రంజీ ట్రోఫీలో అత్యధిక పరుగులు, వికెట్లు తీసిన యశ్ రాథోడ్, యశ్ దూబేలకు మాధవరావు సింధియా అవార్డులు, ఉత్తమ అంపైర్‌గా ఉల్హాస్ గాంధే తదితరులకు కూడా పురస్కారాలు ప్రదానం చేయనున్నారు.

# ఆర్సీబీకి బిగ్ షాక్.. ఐపీఎల్ 2026కి ముందు స్టార్ బౌలర్ దూరం?



**హైదరాబాద్ పెన్ పవర్:** మార్చి 28 నుంచి ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)2026 19వ సీజన్ ప్రారంభం కానుంది. ఈ మెగా టోర్నమెంట్ కోసం క్రికెట్ అభిమానులు ఎంతో ఆసక్తిగా వేచి చూస్తున్నారు. డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు బరిలోకి దిగబోతుంది. ఆ టోర్నీ ప్రారంభానికి ముందే ఆర్సీబీకి సంబంధించిన ఒక ఆందోళన కలిగించే న్యూస్ బయటకు వచ్చింది. ఆ జట్టు స్టార్ పేసర్ జాష్ హేజిల్‌వుడ్ ఇంకా పూర్తిగా గాయం నుంచి కోలుకోలేదని తెలుస్తుంది. ఎన్నో ఏళ్లుగా ఐపీఎల్ ట్రోఫీని దక్కించుకోవాలనే కోరికతో బరిలోకి దిగిన ఆర్సీబీ 2025లో చివరికి దాన్ని కైవసం చేసుకుంది. ఆ విజయంలో ఆస్ట్రేలియా పేసర్ జోష్ హేజిల్‌వుడ్ కీలక పాత్ర పోషించాడు. గత సీజన్‌లో ఆర్సీబీ తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా జోష్ నిలిచాడు. ముఖ్యంగా ఫైనల్ మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ జట్టు బ్యాటర్లను ఇబ్బంది పెట్టి మ్యాచ్ ని తమ వైపుకు మార్చడంలో కీలకంగా వ్యవహరించాడు.గాయపడిన హేజిల్‌వుడ్ ప్రతిష్టాత్మకమైన ది యాషెస్ సిరీస్‌తో పాటు భారత్‌లో జరిగిన టీ20 సిరీస్ నుంచి తప్పుకున్నాడు. తాజా సమాచారం ప్రకారం అతడు ఇంకా పూర్తిగా కోలుకోలేదని సమాచారం. ప్రస్తుతం ఫిజియో పర్యవేక్షణలో ఫిట్‌నెస్ సాధించే ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలుస్తుంది. దీంతో జోష్ ఐపీఎల్ 2026లో ఆడతాడా లేదా అన్నది ప్రస్తుతం సందేహంగా మారింది. అయితే మార్చి 28వ తేదీలోపు అతడు పూర్తిగా ఫిట్ అయ్యే ఛాన్సులు 50-- -50గా ఉన్నాయని టాక్. ఒకవేళ జోష్ హేజిల్‌వుడ్ ఐపీఎల్ కి దూరమైతే.. ఆర్సీబీకి బిగ్ షాకే అని చెప్పాలి.

# జస్‌ప్రీత్ బుమ్రా సంచలన నిర్ణయం.. టీ20లకి గుడ్ బై?



**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచకప్ లో అద్భుతమైన బౌలింగ్ తో ప్రత్యర్థి బ్యాటర్ల గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన బౌలర్ జస్ప్రీత్ బుమ్రా.. తన యార్కర్లు, పదునైనా బంతులతో ప్రపంచ క్రికెట్‌ను శాసిస్తున్న బుమ్రా.. తాజాగా సంచలన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది. బుమ్రా నిర్ణయంపై ఫ్యాన్స్ షాక్ అయినట్లు తెలుస్తుంది. టీమిండియా భవిష్యత్తు ప్రణాళికలను చూస్తే ఇది ఒక మాస్టర్ ప్లాన్‌లా కనిపిస్తుంది. వచ్చే 18 నెలల పాటు బుమ్రా టీ20 ఫార్మాట్‌కు దూరంగా ఉండే ఛాన్స్ ఉందని బీసీసీఐ వర్గాలను నుంచి సమాచారం అందుతుంది. ఇది రిటైర్మెంట్ కాదు, కేవలం వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా తీసుకున్న ఒక నిర్ణయం మాత్రమేనని పేర్కొంటున్నారు.

2027లో జరగనున్న వన్డే వరల్డ్ కప్‌పైనే ఇప్పుడు టీమిండియా పూర్తిగా దృష్టి పెట్టింది. ఈ మెగా టోర్నమెంట్‌లో జస్ ప్రీత్ బుమ్రా సేవలు అత్యంత కీలకం కావడంతో.. అతడిని శారీరకంగా, మానసికంగా రెడీ చేసేందుకే బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది. దాదాపు ఏడాదిన్నర తర్వాత జరగబోయే ఈ ప్రపంచ కప్‌ను దక్షిణాఫ్రికా, జింబాబ్వే , నమీబియా దేశాలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. మొత్తం 14 జట్లు ఈ టోర్నీలో పోటీ పడనున్నాయి. 54 మ్యాచ్‌లు జరగనుండగా, అందులో 44 మ్యాచ్‌లకు సౌతాఫ్రికా ఆతిథ్యం ఇవ్వనుండగా.. మిగిలిన 10 మ్యాచ్‌లను జింబాబ్వే, నమీబియా వేదికలుగా కొనసాగుతాయి. ఇది 2003 ప్రపంచ కప్ తరహాలో జరిగే ఛాన్స్ ఉంది. ఇందులో రెండు గ్రూపులుగా టీమ్స్ విడిపోయి, సూపర్ సిక్స్, సెమీ ఫైనల్స్, ఫైనల్లో పోటీ పడుతాయి. జస్‌ప్రీత్ బుమ్రా వయస్సు, ఫిట్‌నెస్ ని పరిగణనలోకి తీసుకుని.. అన్ని ఫార్మాట్లలో అతడు ఆడి అలసిపోవడం జట్టుకు పెద్ద నష్టం కలుగజేస్తుంది. కాబట్టి, బుమ్రాను వన్డేలు, టెస్టులకే పరిమితం చేసి, వన్డే ప్రపంచ కప్ 2027 కోసం పదును పెట్టాలని టీమిండియా మేనేజ్‌మెంట్ చూస్తుంది. బుమ్రా కూడా ఈ నిర్ణయానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తుంది. ఏదేమైనా, బుమ్రా టీ20 ఫార్మాట్లో కనిపించకపోవడం క్రికెట్ అభిమానులకు లోటుగానే అనిపిస్తుంది. కానీ, 2027లో వరల్డ్ కప్ ట్రోఫీని దక్కించుకోవాలంటే మన బుమ్రా అప్పటి వరకు అద్భుతమైన ఫామ్, ఫిట్‌గా ఉండటం చాలా ముఖ్యం.

# ఐకాన్ స్టార్ నుంచి గ్లోబల్ ఐకాన్ గా!

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కెరీర్‌లో అత్యంత కీలకమైన దశలో ఉన్నారు. రాబోయే ఐదేళ్లలో ఆయన లైనప్‌లో ఉన్న సినిమాలన్నీ అనుకున్నట్లుగా విడుదలై బాక్సాఫీస్ వద్ద విజయం సాధిస్తే టాలీవుడ్ స్టార్‌గానే కాకుండా, భారతీయ చిత్ర పరిశ్రమలోనే అజేయమైన గ్లోబల్ ఐకాన్ గా ఎదిగే అవకాశం ఉంది. -పుష్ప-తో ఇప్పటికే పాన్-ఇండియా మార్కెట్‌ను శాసించిన బన్నీ, రాబోయే చిత్రాలతో తన ప్రభావాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడం ఖాయంగా కనిపిస్తోంది.వచ్చే ఐదేళ్లలో ఆయన లోకేష్ కనగరాజ్, సుకుమార్, త్రివిక్రమ్, సందీప్ రెడ్డి వంగా వంటి అగ్ర దర్శకులతో చేయబోయే సినిమాలు బాక్సాఫీస్ వద్ద వేల కోట్ల వరకు వసూళ్లను సాధించే అవకాశం ఉంది. అనుకున్నది అనుకున్నట్లు జరిగితే గనుక భారతీయ సినిమా చరిత్రలో అత్యధిక కమర్షియల్ స్టామినా ఉన్న హీరోగా బన్నీ నిలుస్తారు. ముఖ్యంగా హిందీ మార్కెట్‌లో బన్నీకి ఉన్న క్రేజ్ అమీర్ ఖాన్, షారుఖ్ ఖాన్ రేంజ్‌కు చేరుకోవడమే కాకుండా, సౌత్ నుంచి నార్త్ వరకు ఏకఛత్రాధిపత్యం వహించే మెగా పాన్-ఇండియా సూపర్ స్టార్ గా బన్నీ అవతరిస్తారు. సాంకేతికంగా , నటన పరంగా కూడా బన్నీ సరి కొత్త శిఖరాలను అధిరోహిస్తారు. త్రివిక్రమ్ సినిమాతో విజువల్ వండర్స్, సందీప్ వంగాతో రా అండ్ రస్టిక్ యాక్షన్ వంటి వైవిధ్యమైన జోనర్లు చేయడం వల్ల, ఆయన నటనలో ఉన్న అన్ని కోణాలు



ప్రపంచానికి పరిచయమవుతాయి. ఇది కేవలం బాక్సాఫీస్ నంబర్లకే పరిమితం కాకుండా, గ్లోబల్ బ్రాండ్ ఎండార్స్‌మెంట్‌లు ,అంతర్జాతీయ చలనచిత్ర వేదికలపై భారతీయ సినిమాకు ప్రతినిధిగా అల్లు అర్జున్‌ని నిలబెడుతుంది. రాజమౌళి సినిమాల తర్వాత ఆ స్థాయి ప్రభావాన్ని చూపగల సత్తా ఉన్న హీరోగా బన్నీ పేరు మారుమోగిపోతుంది.

ఈ ఐదేళ్ల విజయ పరంపర అల్లు అర్జున్‌ను టాలీవుడ్ నెంబర్ వన్ స్థానంలో తిరుగులేని వ్యక్తిగా మార్చేస్తుంది. రికార్డులే కాకుండా, తనకంటూ ఒక సొంత సామ్రాజ్యాన్ని సృష్టించుకుని, భవిష్యత్ తరాల నటులకు ఒక రోల్ మోడల్‌గా నిలిచే అవకాశాలున్నాయి. 2030 నాటికి భారతీయ చిత్ర పరిశ్రమ గురించి ఎక్కడ చర్చ జరిగినా? అల్లు అర్జున్ పేరు మొదటి వరుసలో ఉండటం ఖాయం. ఆ విజయం ఆయనను కేవలం ఒక నటుడిగానే కాకుండా, సినిమా మార్కెట్‌ను శాసించే ఒక మహోన్నత శక్తిగా తీర్చిదిద్దుతుంది. ప్రస్తుతం బన్నీ తమిళ దర్శకుడు అట్లీతో కలిసి ఓ గ్లోబల్ సినిమా చేస్తోన్న సంగతి తెలిసిందే. ఇందులో బన్నీ మూడు-నాలుగు గెటప్స్ లో కనిపించ నున్నాడు? అన్న ప్రచారం సినిమాకు అంతకంతకు హైప్ తీసుకొస్తుంది. పాన్ వరల్డ్ లో ఈ చిత్రం వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది.



**కృతి శెట్టి: బేబీ పింక్‌లో బాడీ - గ్లామ్ ఫోటోషూట్ & రైజింగ్ ఫిల్మ్ కెరీర్**



**శివంగి వర్మ సొగసైన లుక్స్**

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965